18వ వసంతంలోకి
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
అనంతపురం | శ్రీ సత్యసాయి
శనివారం | 09 నవంబర్ 2024 | పేజీలు 14

### పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు
# అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి**



**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ :** పేద ప్రజలకు వైద్య సేవలు అందించేలా వైద్యులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి పిలుపునిచ్చారు. శుక్రవారం అనంతపు రం నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్దనున్న ఐఎంఈ హాల్ లో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ పెడికాన్ 2024 వర్క్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతపురం ఐఎంఏ ఆఫీస్ బేరర్స్ యొక్క అంకితభావం మరియు పట్టుదల తనకెంతో నచ్చిందన్నారు. ఇటీవల ప్రైవేట్ మెడికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం కింద ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. గత 12 సంవత్సరాలుగా ఇది కార్యరూపం దాల్చకపోవడం తనను ఒకింత ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ఈ చట్టం కింద డాక్టర్లను తీసుకోవడం జరిగిందని, వారు నిర్ణయాత్మకమైన అభిప్రాయాలను

మిగతా 2లో

---

లక్ష్యం చేరుకోవాలన్న ఆత్రమే తప్ప.. కానరాని పారదర్శకత..?

"రెండు దశాబ్దాలు పూర్తయినా ఆధార్ తప్పిదాలను నేటికీ సరిదిద్దుకుంటున్నాం..

# అపార తప్పిదాలు..




ఎప్పుడో బ్రిటీష్ కాలం నుండి విద్యాసంస్థల్లో అమలు చేస్తున్న రికార్డులు ప్రామాణికంగా ఉండేవి. స్కూల్ రికార్డ్, యు డైస్‌లో విద్యార్థుల వివరాలు ఒకే రకంగా ఉన్నప్పటికీ ఆధార్‌లో తేడాలు ఉన్నందువల్ల అపార్ నమోదు కోసం విద్యార్థుల రికార్డులు మార్పు చేస్తూ విద్యాశాఖ అధికారులు తాజాగా ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం."

**అనంతపురం విద్య, మేజర్ న్యూస్:** ఘనమైన లక్ష్యాలను ఏర్పరచుకున్న సమయంలో అంతకుమించి ఉన్న అవరోధాలను అధిగమించాలి. ఒక విద్యార్థికి లైఫ్ టైం యునిక్ కార్డ్ కేటాయించడం అంటే అంత ఆషామాషీ విషయం కాదు. ఆధార్ కార్డ్ తరహాలో విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఆటోమేటెడ్ పెర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) కార్డు తీసుకొచ్చేందుకు నిర్ణయించింది. సంకల్పం ఘనమే అయినా.. ఆచరణ ఆందోళన కలిగిస్తోంది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం తీసుకొచ్చిన ఆధార్ కార్డ్ నమోదులో చోటుచేసుకున్న తప్పిదాలను నేటికీ సరి చేసేందుకే సమయం సరిపోవడం లేదు. ఇప్పటికి ఆధార్ కార్డ్‌లో ఉన్న తప్పిదాలను సవరించేందుకు లెక్కకు మించి ప్రజలు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్న విషయం విధితమే. ఇక తాజాగా అపార్ విషయానికొస్తే..

03

- సవరణలకు అంతంత మాత్రమే ఆస్కారం ఉన్నా అపార్‌లో ఎందుకంత తొందర..?
- విద్యార్థుల భవిష్యత్తు ఇబ్బందులకు ఎవరిది బాధ్యత..?
- ప్రభుత్వ హై స్కూల్స్‌లోనూ అదే తంతు
- తప్పిదాలకు ఆస్కారం లేకుండా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశం..
- లైట్‌గా తీసుకుంటున్న ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు..
- సర్వత్రా విమర్శలకు తావిస్తున్న అపార్ నమోదు...

**విద్యార్థుల సంఖ్య**
**3,71,001**


ఇప్పటివరకు పూర్తి చేసిన ఎంట్రీలు
**1.90 లక్షలు**

ఇంకా పూర్తి చేయాల్సిన ఎంట్రీలు
**1.80 లక్షలు**

రోజుకు 15 వేల ఎంట్రీలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ లక్ష్యం..




---



### వైద్యం కోసం వస్తే
# పెన్షన్ డబ్బులు దొంగిలించారు
**వృద్ధ దంపతుల తీవ్ర ఆవేదన**

- **12 వేల రూపాయలను ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు**
- **ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆలస్యంగా వెలుగు చూసిన వైనం**
- **బెలుగుప్పకు చెందిన వృద్ధులు కన్నీటి పర్యంతం**

**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ :** నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కి వైద్యం కోసం వస్తే తాము దాచుకొని తెచ్చుకున్న పెన్షన్ డబ్బులను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారని జిల్లాలోని బెలుగుప్ప

మిగతా 03 ››

---

# పుట్టపర్తిలో ఆప్కో షోరూమ్‌ను ప్రారంభించిన మంత్రి



**పుట్టపర్తి మేజర్ న్యూస్:** చేనేత వస్త్రాల వినియోగంపై ప్రజల నుంచి వస్తున్న డిమాండ్ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా మరో 7 ఆప్కో షోరూమ్ లు ఏర్పాటు చేయనున్నామని, ప్రైవేటు వ్యాపార సంస్థలకు ధీటుగా షోరూమ్ లను రూపొందిస్తున్నామని రాష్ట్ర చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి లోని ఆప్కో షోరూమ్ ను మంత్రి సవిత శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పుట్టపర్తిలో ఆప్కో షోరూమ్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. 2014-19 చంద్రబాబు ప్రభుత్వ పాలన చేనేతకు స్వర్ణయుగమన్నారు. ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి చేనేత కార్మికులకు ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. తరవాత వచ్చిన జగన్ ప్రభుత్వం చేనేత పరిశ్రమను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ప్రభుత్వం నుంచి చేయూత అందకపోవడంతో గడిచిన అయిదేళ్లలో ఎందరో నేతన్నలు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. టిడిపి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో చేనేత రంగానికి మంచిరోజులు వచ్చాయన్నారు. 2014-19లో అమలు చేసిన పథకాలన్నింటినీ అమలు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారన్నారు. అదే సమయంలో కొత్త పథకాలను కూడా అమలు చేయడానికి ప్రణాళికలు సైతం సిద్ధం చేశారన్నారు. దీనిలో భాగంలో చేనేత వస్త్రాల తయారీకి సబ్సిడీలు అందజేస్తున్నారన్నారు. నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ ఇస్తున్నామన్నారు.

**ఈ ఏడాదిలో 10 ఆప్కో షోరూమ్ లు ఏర్పాటు...**

ఏడాదిలో కొత్తగా 10 ఆప్కో షోరూమ్ లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారని మంత్రి సవిత వెల్లడించారు. దీనిలో భాగంగా ఇప్పటికే రెండు షోరూమ్ లు ప్రారంభించామని, ప్రస్తుతం పుట్టపర్తిలో మూడో షోరూమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇవే కాకుండా త్వరలో మరో 7 షోరూమ్ లను ప్రారంభించబోతున్నట్లు మంత్రి వెల్లడించారు. నేతన్నలు తయారు చేసే వస్త్రాలను కేవలం ఆప్కోలోనే కాకుండా

మిగతా 2లో

---

# సమస్యలకు దూరంగా ఉండండి...
### కలిసి మెలిసి ప్రశాంతంగా జీవించండి

- **కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామ ప్రజలకు జిల్లా ఎస్పీ పి.జగదీష్ పిలుపు**
- **సమస్యాత్మక గ్రామమైన గోళ్లలో ఈరోజు పర్యటించిన జిల్లా ఎస్పీ**
- **గ్రామస్తులతో ముఖాముఖి... గ్రామంలోని తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్న ఎస్పీ**
- **ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొస్తే చట్ట పరధిలో పరిష్కరిస్తామని హామీ**



**అనంతపురంక్రైం,మేజర్‌న్యూస్** కళ్యాణదుర్గం నియోజకవర్గం పరిధిలోని గోళ్ళ గ్రామం లోని పీర్ల చావిడి వద్ద ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు..అల్లర్లు, గొడవలు జోలికెళ్లకుండా ఉండేలా గ్రామస్తులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. ఎటువంటి గొడవలు చేసుకోవద్దన్నారు. కక్షలు, కార్పణ్యాలు వద్దు...గ్రామాభివృద్ధి, పిల్లల భవిష్యత్తు ముఖ్యం అని తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలు నివారించాలి. బయటికెళ్లేటప్పుడు సెల్ ఫోన్‌ను మరువకుండా ఎలాగైతే తీసికెళ్తామో అదేవిధంగా హెల్మెట్ తీసికెళ్లాలి అని అన్నారు.

మిగతా 2లో

# అపార తప్పిదాలు..

▸▸ మొదటి పేజీ తరువాయి

విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి ఈ కార్డ్ ఎంతో కీలకమైనది. ఈ కార్డుయే విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశిస్తుంది. ఈ కార్డులో ఏమాత్రం తప్పిదాలు చోటు చేసుకున్న ఇక అంతే సంగతులు. జీవితాలే తలకిందలైపోతాయి. మరి అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ కార్డు నమోదులో పారదర్శకత ఉందా అంటే ఎన్నో అనుమానాలు చోటుచేసుకుంటున్నాయి. వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత విద్యాశాఖ, జిల్లా ఉన్నతాధికారులపై ఉంది. ఇప్పటికే దీనిపై **అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ప్రత్యేక దృష్టి సాధించారు. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునే దిశగా ఆయన కార్యోన్ముఖులయ్యారు.** ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ.. అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. తప్పిదాలు లేకుండా అపార్ నమోదు ఉండాలన్న జిల్లా కలెక్టర్ ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా అన్నదే ఇక్కడ అపారమైన ప్రశ్న.

### స్కూల్ రికార్డులను తోసిపుచ్చి ఆధార్ ప్రామాణికంగా నమోదుని మమ అనిపిస్తున్న వైనం..

స్కూల్ రికార్డులను తోసిపుచ్చి ఆధార్ ప్రామాణికంగా నమోదుని మమ అనిపిస్తున్న వైనం విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళనలకు మరింత ఆజ్యం పోస్తోంది. అపార్ నమోదు ప్రక్రియ ఎంతో పారదర్శకంగా ఉండాలి. ఒకటికి పలుసార్లు సరిచూసుకొని తప్పిదాలకు ఆస్కారం లేకుండా నమోదు చేయాలి. అప్డేషన్ చేసేవారికి ఎంతో ఓపిక ఉండాలి. విద్యార్థుల భవిష్యత్తు పట్ల వారికి నిబద్ధత ఉన్నప్పుడే విద్యార్థులు భవిష్యత్తులో ఇబ్బంది పడకుండా ఉంటారు. అలా కాకుండా అపార్ నమోదుని ఓ గుదిబండగా భావిస్తే విద్యార్థులు మూల్యం చెల్లించుకోక తప్పదు.

### ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల్లోనూ అదే తంతు..

అపార్ నమోదుని గురుతర బాధ్యతగా తీసుకోవలసిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు అధికారుల ఒత్తిళ్లను తాళలేక లక్ష్యాలను చేరుకోవాలని ఆత్రంతో ఎలా ఉన్నా అపార్ నమోదు ప్రక్రియ పూర్తి చేస్తున్నట్లు తెలిసింది. తప్పిదాలు ఉన్నాయని తెలిసినా, సర్ నేమ్, డబల్ అక్షరం, ఇనిషియల్ తదితర వాటిలో తప్పిదాలు చోటు చేసుకుంటున్నా.. ఎంట్రీ చేస్తున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా 3,71,001 మంది విద్యార్థుల అపార్ కార్డు నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 1.90 లక్షల ఎంట్రీలను పూర్తి చేశారు. ఇంకా 1.80 లక్షల ఎంట్రీలను పూర్తి చేయాల్సి ఉంది. రోజుకు 15 వేల ఎంట్రీలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జూమ్ సమావేశం ద్వారా ఆదేశాలు ఇచ్చారు. తప్పిదాలు లేకుండా ఎంట్రీలను పూర్తి చేయడం ముఖ్యమా.. ప్రభుత్వం గడువు విధించిందని, తప్పిదాలు ఉన్నాయని తెలిసినా.. చేతులు దులుపుకోవడమా.. భవిష్యత్తులో విద్యార్థుల ఇబ్బందులకు ఎవరిది బాధ్యత అని ప్రశ్నిస్తూనే.. ఓ పెద్ద ప్రహసనమైన అపార్ ప్రక్రియలో ఉండాల్సింది ఆత్రం కాదు. పారదర్శకత అని విస్పష్టం చేస్తున్నారు విద్యావేత్తలు.

# అపార్ అప్డేషన్ వేగవంతం చేయాలి..

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**

**క్షేత్రస్థాయిలో అపార్ అప్డేషన్ ప్రక్రియను పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్**

**నగరంలోని శ్రీకృష్ణదేవరాయ నగరపాలక సంస్థ పాఠశాలలో, 44వ సచివాలయంలో, అనంతపురం రూరల్ మండల వనరుల కేంద్రంలో అపార్ అప్డేషన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



అనంతపురం విద్య మేజర్ న్యూస్ : అపార్ అప్డేషన్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటన చేశారు. శుక్రవారం అనంతపురం నగరంలోని శ్రీకృష్ణదేవరాయ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో అపార్ అప్డేషన్ ఎలా జరుగుతోందో తనిఖీ చేశారు. అనంతరం నగరంలోని 26వ డివిజన్లో ఉన్న హమాలీ కాలనీలో 44వ వార్డు సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి సచివాలయ సిబ్బందితో అపార్ అప్డేషన్ లో ఏవైనా సమస్యలు ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. తదనంతరం అనంతపురం రూరల్ పరిధిలోని మండల వనరుల కేంద్రాన్ని తనిఖీ చేసి అపార్ జనరేషన్ లో చేపట్టాల్సిన చర్యల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అపార్ అప్డేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అపార్ జనరేషన్ కు సంబంధించి ఎప్పటికప్పుడు రిపోర్టు అందజేయాలన్నారు. శ్రీకృష్ణదేవరాయ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో 656 మంది విద్యార్థులు ఉండగా, ఇప్పటివరకు అపార్ జనరేషన్ 245 మందికి చేయగా, ఇంకా 411 మందికి పెండింగ్ ఉన్నాయని, వాటిని వేగంగా జనరేషన్ చేయాలన్నారు. ప్రతి పాఠశాల లోనూ 2 టీంలను ఏర్పాటు చేయాలని, ఒకటి జనరేషన్ చేసేందుకు, మరొకటి కరెక్షన్ చేసేందుకు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసి, అపార్ జనరేషన్లో ఏం సమస్యలు వస్తున్నాయి అనేది అడిగి తెలుసుకుని, ప్రక్రియను వేగంగా చేయాలని ఆదేశించారు. తదనంతరం మండల వనరుల కేంద్రాన్ని తనిఖీ చేసి ప్రతి ఎమ్మార్సీలోను అవసరమైన కంప్యూటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అపార్ జనరేషన్ కోసం ఎక్కువ కంప్యూటర్లు, కౌంటర్లు పెట్టాలన్నారు. ఈ ప్రక్రియను ప్రశాంతంగా చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, డీఈవో ప్రసాద్ బాబు, నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వరరావు, తహసిల్దార్ హరికుమార్, ఏపీఎం నాగరాజు, ఎంఈఓలు వెంకటస్వామి, సరితారాణి, తదితరులు పాల్గొన్నారు.

# పోస్ట్ ఆఫీసులలో ఎన్పీసీఐ యాక్టివేషన్‌కు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు

**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి సచివాలయం పరిధిలో ఐపిపిబి ఖాతాలు మరియు ఎన్పీసీఐ యాక్టివేషన్ కొరకు ఈనెల 15వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు అనంతపురం పోస్టల్ సూపరింటెండెంట్ గుంపస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రభుత్వ సామాజిక ప్రయోజనాలు పొందేందుకు లబ్ధిదారులు బ్యాంకు మరియు తపాలా శాఖ ఖాతాలకు ఎన్పీసీఐ లింకును యాక్టివేషన్ చేయించుకోవాలన్నారు. చాలామంది లబ్ధిదారులు ఎన్పీసీఐ ద్వారా ఆధార్ అనుసంధానం చేసుకోకపోవడం వల్ల వారికి సంక్షేమ పథకాలు అందడం లేదని, కావున ప్రజలందరూ నీ దగ్గరలోని తపాలా కార్యాలయంకు వెళ్లి మీ మీ ఖాతాకు ఎన్పీసీఐ లింక్ చేయించుకోవాలని, ఖాతా లేనివారు తపలా కార్యాలయంలో ఖాతా తెరిస్తే మూడు రోజులలో ఎన్పీసీఐ యాక్టివేషన్ జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సిద్ధరాచర్ల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



**శింగనమల,మేజర్ న్యూస్ :** శింగనమల నియోజకవర్గం లోని నార్పల మండలం సిద్ధరాచర్ల గ్రామ రచ్చకట్ట వద్ద సర్పంచ్ సాకే రామాంజనేయులు ఆధ్వర్యంలో హర్షిత ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఉచిత వైద్య శిబిరంలో ఎంబిబియస్ డాక్టర్ జి రాము నేతృత్వంలో డయాబెటీస్, గ్యాస్ట్రిక్, ఫైల్స్ ఫిస్టులా.,వెరికోస్ వైన్స్, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, గైనకాలజి, పాలీట్రామా, చెవి, ముక్కు, గొంతు, న్యూరో యురాలజి వంటి వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యపరీక్షలతో పాటు ఉచితంగా మందులు మందులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాకే రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలోని ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఎలాంటి జబ్బులతో బాధపడకుండా ఉండాలని ఇలాంటి క్యాంపులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. డాక్టర్ సలహా మేరకు జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యానికి కాపాడుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామచంద్ర, ఫార్మసిస్ట్ రాజశేఖర్, మేనేజర్ హరి, జిఆర్ బిఎస్ మారుతి, సిబ్బంది, గ్రామస్తులు నాగిరెడ్డి, తిరుపాలు,రాజు, చంద్రశేఖర్ రెడ్డి,తిరుపాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం కోసం వస్తే పెన్షన్ డబ్బులు దొంగిలించారు

▸▸ మొదటి పేజీ తరువాయి

మండల కేంద్రానికి చెందిన వృద్ధ దంపతులు గురు స్వామి రెడ్డి, కుళ్లాయమ్మ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వారు తమ వివరాలను వెల్లడించారు. వృద్ధ దంపతులలో ఒకరైన గురు స్వామి రెడ్డికి అధిక మూత్రం వస్తుండడంతో పరీక్షలు చేయించుకునేందుకు ఈనెల ఏడవ తేదీన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చేరుకున్నారు. పరీక్షించిన వైద్యులు వృద్ధుడికి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీంతో వారు తమ వెంట తెచ్చుకున్న బ్యాగుల ను పక్కనే పెట్టుకొని ఉండగా అందులో 12 వేల రూపాయలను అత్యంత జాగ్రత్తగా ఉంచుకున్నారు. అయితే వారి పక్కనే కూర్చుని ఉన్న వారు వారితో అధమరపు చేయడంతో ఒక్కసారిగా వారి దగ్గర ఉన్న 12 వేల రూపాయలను దోచుకొని వెళ్లినట్లు బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము వైద్యం కోసం వస్తే తమ పరిస్థితి దయనీయంగా మారిందంటూ కన్నీటి పర్యంతమయ్యారు. సంబంధిత అంశానికి సంబంధించి పోలీస్ స్టేషన్ లో సంప్రదిస్తే రెండు రోజులు ఆగి రమ్మని చెప్పినట్లు వెల్లడించారు. తాము శుక్రవారం తిరిగి ఆసుపత్రికి చేరుకున్నామని అయితే తమ డబ్బులు వస్తాయా రావా అంటూ వారు ప్రశ్నార్థకంగా మిగిలిపోయారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో దొంగతనాలు రోజురోజుకు పెరుగుతుండడంతో కనీసం పట్టించుకునే వారు కానీ వారిని అరికట్టే వారు కానీ లేకుండా పోయారు. దొంగతనాలు నిత్య కృత్యంగా మారాయి.

# నేడు,రేపు అనంత అర్బన్ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం

**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** అనంతపురము అర్బన్ నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల్లో నేడు,రేపు (9,10)తేదీలల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో కేశవ నాయుడు, సహాయ ఓటరు నమోదు అధికారి, అర్బన్ తహశీల్దార్ హరికుమర్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. బూత్‌స్థాయి అధికారులు (బీఎల్వో)లు ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఓటర్ల నమోదు కోసం (ఫారం-6), తొలగింపుకు (ఫారం-7), మార్పు, సవరణలకు (ఫారం-8) కోసం ధరఖాస్తులు స్వీకరించాలని బిఎల్వోలను వారు ఆదేశించారు. రెండు రోజుల ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని అర్బన్ నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఓటరు నమోదు అధికారులు తెలియజేశారు.

# డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు



**తాడిపత్రి మేజర్ న్యూస్:** తాడిపత్రి రూరల్ పరిధిలో ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై రూరల్ పోలీసులు శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శివగంగాధర్ రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్, మత్తుపానీయాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని అని అన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా ఉన్నత చదువులు చదివి జీవితాన్ని చక్కదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు.

# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

**రాయంపల్లిలో పారిశుద్ధ్యం పనులు**



**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** గ్రామంలో ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని పంచాయతీ కార్యదర్శి వసికేరి మహేష్ తెలిపారు. మండల పరిధిలోని రాయంపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి వసికేరి మహేష్ శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారితో పాటు పలు కాలనీల్లోని పరిసరాలను శుభ్రం చేయించారు. మురుగునీరు ప్రవాహానికి అడ్డుగా ఉన్న వ్యర్థాలను పంచాయతీ సిబ్బంది చేత తొలగించారు. రహదారి పొడవునా పొడి సున్నం వేయించారు. పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి బయటి ప్రాంతాలకు తరలించారు. దోమల వ్యాప్తి కారణంగా డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా లాంటి సీజనల్ వ్యాధులు ప్రభలు తాయని, వాటి కట్టడికి గ్రామస్తులు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. రాత్రి సమయాల్లో ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని సూచించారు.

# అసుపత్రిలో గర్భవతులకు భోజన సౌకర్యం



**గుత్తి, మేజర్ న్యూస్ :** గుత్తి ప్రభుత్వ అసుపత్రిలో శుక్రవారం గర్భవతులకు బసినేపల్లి తాండకు చెందిన సింగర్ మంగ్లీ సహకారంతో అన్నధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు టీడీపీ యువనాయకులు గుమ్మనూరు ఈశ్వర్, గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ హజరై నాయకులతో కలసి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అమ్మ శారదామ్మ అయన సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి సతీమణి త్రీవేణి జ్ఞాపకార్థం ప్రతి శుక్రవారం పార్టీ శ్రేణులు చేపట్టడం హర్షనీయమని వారు పేర్కొన్నారు. అన్నదానం కార్యా్క్రమానికి మందుకు వచ్చిన వారిని అభినందిం చారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు యంకే చౌదరి, మండల కన్వీనర్ బర్ధివలి, టిడిపి నాయకులు చికెన్, శీనా, ప్రతాప్, రమేష్, తిమ్మప్ప, మద్దిలేటి, పిల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్ రావు, లాయర్ సోమశేఖర్‌తో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అసుపత్రికి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఢిల్లీ ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంప్ కు ఎంపికైన విద్యార్థులను అభినందించిన జేఎన్టీయూ విసి

**అనంతపురం విద్య మేజర్ న్యూస్ :** ఢిల్లీ ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంప్ కోసం ఎంపికైన ఎస్. వెంకటేష్ నాయక్, జి నందితను జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం ఉపకులపతి ఆచార్య హెచ్ సుదర్శన్ రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈనెల 10వ తేదీన బయలుదేరి 10 రోజులపాటు కవియిత్రి బహినాబాయి చౌదరి నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీ జలగం క్యాంప్ లో ఉండి మరల ఈనెల 21వ తేదీన మహారాష్ట్ర నుండి తిరుగు ప్రయాణమై అనంతపురం ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకుంటారని తెలిపారు. ఉపకులపతి ఆచార్య హెచ్ సుదర్శన్ రావు, రిజిస్టర్ ఆచార్య కృష్ణయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శారద లు ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## కనేకల్ - కలేకుర్తి రోడ్డు నిర్మాణంకు భూమి పూజ, శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కాలవ



**కనేకల్లు, మేజర్ న్యూస్ :** కనేకల్లు, ఉరవకొండకు పోయే రోడ్డు కలేకుర్తి క్రాస్ నుండి కలెకుర్తి గ్రామం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు 1 కోటి 8 లక్షల రూపాయల గ్రాండ్ తో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు రాయదుర్గం నియోజకవర్గం శాసనసభ్యులు కాలువ శ్రీనివాసులు చేతుల మీదుగా శుక్రవారం భూమి పూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కాలువ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎటు చూసినా రహదారుల గుంతల మాయంతో ప్రజలు నానా అవస్థలు పడుతుండేవారు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడినాక ఆంధ్రప్రదేశ్ లో రోడ్లు నిర్మాణం మరమ్మత్తుల కోసం వేల కోట్ల రూపాయలను పెట్టి రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కలేకుర్తి గ్రామానికి పోవాలంటే నేటి వరకు చాలా కష్టాలు ఉండేవి కనేకల్ చెరువు కట్ట నుండి కలేకుర్తి క్రాస్ వరకు 48 కోట్లతో నూతన బ్రిడ్జి నిర్మాణానికి దసరా రోజే భూమి పూజ చేశామన్నారు. ఈ కోటి లక్షల ఖర్చుతో కలేకుర్తి గ్రామంలోకి పూర్తిగా రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. దీని వలన ఈ గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. తెలుగుదేశం జనసేన బిజెపి కలయికతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ ఆనంద రాజులు, కన్వీనర్ లాలెప్ప, సుదర్శన్, శరబన్న గౌడ, హనుమాపురం సర్పంచ్ జయ రామ చౌదరి, ఎంపీటీసీ నరేంద్రబాబు, వన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేనుండి నియామక పత్రాలు అందుకున్న అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్‌లు

### ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండానే అంగన్వాడీ ఉద్యోగం



**శెట్టూరు, మేజర్ న్యూస్ :** కళ్యాణదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా విడుదల చేసిన నోటిఫికేషన్ లో ఎంపికైన నూతన అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకున్నారు. ఎంపీకైనా ఉద్యోగార్థులు మాట్లాడుతూ ఎలాంటి డబ్బు తీసుకోకుండా ఉద్యోగ అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్‌ల ద్వారా పిల్లలకు, గర్భిణీలకు అందించే పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సూచించారు.

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో "ప్రైవేటు" దందా!!

- గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారం
- ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోని వైనం
- వాటాలు చేరుతున్నాయంటూ విమర్శలు
- ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడు

**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ :** నగరు శివారు ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రైవేటు వ్యక్తులకు దందా కేంద్రంగా మారింది. ఏకంగా రక్త నమూనాలను గుర్తుచేప్పుడు కాకుండా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కి అత్యంత సమీపంలో ఉన్న రెండు డయాగ్నస్టిక్స్ సెంటర్ల వారు ఆసుపత్రి కేంద్రంగా ప్రైవేటు దందాను నడిపిస్తున్నారు. ఈ అంశానికి సంబంధించి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా వారు పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో వారికి కూడా వాటాలు అందుతున్నాయని తీవ్రస్థాయిలో వెల్లువెత్తుతున్నాయి. ఇంటి దొంగను ఈశ్వరుడైన పట్టడు అన్న చందంగా వారి వ్యవహారం మూడు పూలు ఆరు కాయలుగా యదేచ్ఛగా సాగిపోతోంది. దీనికి ప్రధాన కారణం పర్యవేక్షణ పూర్తిగా లోపించడంతో ఇలాంటి వ్యవహారం విచ్చలవిడిగా కొనసాగుతోందని తీవ్రమైన విమర్శలు వినిపిస్తున్నాయి.

### ప్రైవేటు దందా సాగుతోంది ఇలా..

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి అత్యంత సమీపంలో రెండు డయాగ్నస్టిక్ సెంటర్లు వెలిశాయి. వారు చీకటి పడితే చాలు తమ చీకటి కోణంతో వ్యవహరిస్తూ ఏకంగా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ ఇన్ పేషెంట్లుగా వ్యవహరిస్తున్న వారి నుంచి రక్త నమూనాలను తీసుకెళ్లి వారి డయాగ్నస్టిక్ సెంటర్ లో పరీక్షలు నిర్వహించి ఎలాంటి అనుమానం రాకుండా ఉదయాన్నే వారికి సంబంధిత రిపోర్టులను అందజేస్తున్నారు. దీనికి అక్కడ ఉన్న వైద్యాధికారులు కూడా పూర్తి సహకారం అందిస్తుం డడంతోనే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మొత్తం వ్యవహారం యదేచ్ఛగా సాగిపోతోందని తీవ్రమైన విమర్శ లు వినిపిస్తున్నాయి. అదే సమయంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ రాత్రి సమయాల్లో విధులను సక్రమంగా నిర్వహించకపోవడంతో వారి వ్యవహారం అత్యంత చాకచక్యంగా సాగిపోతోందని విమర్శిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ప్రధాన సూత్రధారిగా వ్యవహరిస్తున్న డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వహిస్తున్న వ్యక్తి రెండు నెలల క్రితం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో తన ట్రైనింగ్ కు సంబంధించి అప్రెంటిస్షిప్ ను పూర్తిచేసిన ఆ వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా రాత్రి సమయాలలో వచ్చి రక్త నమూనాలను స్వీకరించి వాటికి సంబంధించిన రిపోర్టులను సంబంధిత రోగులకు గుట్టుచప్పుడు కాకుండా అందిస్తున్నాడని తీవ్ర స్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించి సంబంధిత అధికారులు సిసి ఫుటేజ్ లను చూస్తే పూర్తిస్థాయి అవగాహన వస్తుందంటున్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి సంబంధించి అనేక విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.



### పర్యవేక్షణ లోపంతో వ్యవహారం

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అనుబంధంగా కొనసాగుతోంది. దీనికి సంబంధించి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఒకపక్క ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మరోపక్క ఉండడంతో పర్యవేక్షించే అధికారులే కరువయ్యారు. సంబంధిత అధికారులు 12 తర్వాత కనుమరుగవ్వడంతో ఇక్కడ వ్యవహారం అత్యంత దుర్భరంగా మారిందంటూ విమర్శిస్తున్నారు. కనీసం చుట్టూ కూడా అధికారులు పర్యవేక్షించడం లేదంటూ విమర్శిస్తున్నారు. పర్యవేక్షణ లోపించడంతోనే ఇలాంటి వ్యవహారం కొనసాగుతోందని విమర్శిస్తున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందంటూ దీనికి సంబంధించి అక్కడ విధులు నిర్వహించే వారే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చొరవ చూపాలని కోరుతున్నారు.

# గుంతలు పడ్డ రోడ్లకు త్వరలోనే మోక్షం.. ఎమ్మెల్యే దగ్గుపాటి

- తిలక్ నగర్ లో మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమం
- గత ఐదేళ్లలో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు అధ్వానంగా మారాయి
- 35లక్షల ఎన్.సి.ఏ.పి నిధులతో రోడ్ల మరమ్మతులు చేపడుతాం
- అధికారంలోకి వచ్చిన 4నెలల్లోపే మార్పు చూపిస్తున్నాం



**అనంతపురం విద్య మేజర్ న్యూస్ :** అనంతపురం నగరంలో గత ఐదేళ్లలో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల అధ్వాన్నంగా మారాయని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. గుంతలు పడ్డ రోడ్లకు త్వరలోనే మోక్షం లభిస్తుందన్నారు. మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా ఓల్డ్ టౌన్ లోని 12వ డివిజన్ లో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, 12 డివిజన్ కార్పొరేటర్ జనబలం బాబా, మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఉదయం ఏడు గంటల నుంచి ఇంటింటికి వెళ్లి ఆయన సమస్యలు తెలుసుకున్నారు. దుకాణాలు ఎక్కువగా ఉండటంతో ఆ ప్రాంతాలంతా కలియతిరిగారు. ప్రతి దుకాణం వద్దకు వెళ్లి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. స్థానికులు ప్రధానంగా తిలక్ రోడ్డు సమస్య గురించి ప్రస్తావించారు. ఇరుకైన రోడ్లు ఉన్నాయని.. పైగా గుంతలు పడి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. డ్రైనేజీలు కూడా సరిగా శుభ్రం చేయడం లేదని.. ఇటీవల కొంత మెరుగుపడిందని స్థానికులు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ గత ఐదేళ్లలో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు అధ్వాన్నంగా మారాయని అన్నారు. ఇప్పటికే నగరంలోని రోడ్ల మరమ్మతులకు 35 లక్షల రూపాయలతో ఎన్.సి.ఏ.పి నిధులు కోసం ప్రతిపాదనలు పంపామని.. ప్రస్తుతం కలెక్టర్ వద్ద ఈ ఫైల్ ఉందన్నారు. త్వరలోనే నిధులు రాగానే గుంతలు పడ్డ రోడ్లన్నింటికీ మరమ్మతులు చేస్తామని చెప్పారు. గత ఐదేళ్లలో అధ్వాన్నంగా మారిన పరిస్థితిలన్నింటినీ ఒక్కొక్కటిగా మారుస్తున్నామన్నారు. ఈ నాలుగు నెలల్లోపే మార్పు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కృష్ణకుమార్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, రాయలసీమ బలిజ సంఘం యువజన జిల్లా అధ్యక్షుడు తొండపునాటి రమేష్, మాజీ కో ఆప్షన్ మెంబర్ మున్వర్, తెలుగుదేశం పార్టీ నాయకులు బాల, సుంకన్న, ఈడిగ నాగభూషణం, సిరిసాల రాంబాబు, మురళి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణకు తరలిరండి



కదిరి, మేజర్‌న్యూస్ : ఈ నెల 10న పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వడ్డెర్లు తరలిరావాలని ఖాద్రీ వడ్డెర సంఘం అధ్యక్షుడు గంగయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కందికుంట హాజరై విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్ర మానికి రెండు తెలుగు రాష్ట్రాలలోని నాయకులను సైతం ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. మొదటగా ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి ఓబన్న విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు సైతం ఏర్పాటు చేయడం జరిగిందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వడ్డెర సంఘ నాయకులు, కార్యకర్తలు, వడ్డెర్లు పెద్ద ఎత్తున పాలొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రమణ, ఉపాధ్యక్షులు నరసింహులు, ప్రధాన కార్యదర్శి సంపంగి గోవర్ధన్, కోశాధికారి చంద్రశేఖర్, కుటాగుళ్ల గంగాధర్, ఖద్దర్ రమణ, తేపల్లి ఉత్తప్ప, చంద్ర, పార్థసారథి, గంగరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండలాల్లో విద్యుత్ అంతరాయం

**బుక్కపట్నం మేజర్ న్యూస్ :** సత్యసాయి జిల్లా కొత్త చెరువు, బుక్కపట్నం మండలంలో శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ లు వెంకటేష్ నాయక్, నారాయణస్వామి నాయక్ తెలిపారు కొత్త చెరువు, బుక్కపట్నం మండలం పరిధిలోని ప్రధాన విద్యుత్ తీగల మరమ్మతులు కారణంగా అంతరాయం ఉంటుందని తెలియజేశారు కావున విద్యుత్ వినియోగదారులు మరియు వ్యాపారస్తులు అంతరాయాన్ని సహకరించాలని విద్యుత్ అధికారులు తెలియజేశారు

## 10న జరగాల్సిన ఉచిత డీఎస్సీ శిక్షణ పరీక్ష వాయిదా

### – జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డి.డి కుష్బు కొఠారి

**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** సాంఘిక,గిరిజన సంక్షేమ శాఖల ద్వారా ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు రాష్ట్రంలో గుర్తింపు పొందించిన శిక్షణ సంస్థల ద్వారా ఉచిత డిఎస్సీ కోచింగ్, శిక్షణ ఇవ్వడానికి ఎంపిక కోసం ఈనెల 10న నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డి .డి కుష్బు కొఠారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా,గుంటూరు జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన మోడల్ ప్రవర్తన నియమావళి అమలులో ఉండటం వల్ల 10న జరగాల్సిన మెగా డీఎస్సీ స్క్రీనింగ్ పరీక్ష వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం నుండి ఉత్తర్వులు అందాయని డి.డి తెలిపారు. పరీక్ష వాయిదా విషయాన్ని ధరఖాస్తు చేసుకున్న ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు గమనించాలని, తదుపరి పరీక్ష నిర్వహించు తేదీను త్వరలోనే ప్రకటిస్తామని డి.డి తెలియజేశారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో క్రైస్తవుల సంక్షేమ పథకాలకు నిధులు కేటాయింపు పెంచాలి

### – ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాస్ విజ్ఞప్తి



**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** త్వరలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్‌లో క్రైస్తవుల సంక్షేమ పథకాలకు నిధులు కేటాయింపు పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు శుక్రవారం సీఎంవో ఆఫీసులో టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు శుక్రవారం వినతిపత్రం అందచేశారు. ఈటె స్వామిదాసు మాట్లాడుతూ గతంలో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు క్రైస్తవులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వైఎస్ జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక క్రైస్తవుల సంక్షేమ పథకాలు తుంగలో తొక్కేశారని తెలిపారు. రాబోయే కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం క్రైస్తవులకు అండగా నిలుస్తుందని తెలిపారు.

## ముద్దాయి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

**కదిరి,మేజర్ న్యూస్:** పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం వెనుక వైపు నివాసం ఉంటున్న హరిప్రసాద్ పై హత్యాయత్నం పాల్పడిన కేసులో బాల మురళీకృష్ణ అలియాస్ బాలు తండ్రి ఇషాక్ ను అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్ఐ బాబ్జాన్ తెలిపారు. తనను హత్య చేసే ఉద్దేశం తోనే బాలమురళీకృష్ణ అలియాస్ బాలు తండ్రి ఇసాక్ తనపై ఇటుకుతో దాడి చేయగా తన తలకి గాయమైన విష యంలో ఈ నెల మూ డో తేదీన పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ముద్దా యిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుప రచ గా కోర్టు రిమాండ్ విధించిందని ఎస్ఐ తెలిపారు. గతంలో కూడా పలు కేసులలో నిందితుడని, ఆయన కదలికలను నిరంతరం పోలీసులు నిఘా ఉంచారని, సదరు ముద్దాయిపై పట్టణ పోలీస్ స్టేషన్లో రౌడీ షీట్ సైతం ఓపెన్ చేయడం జరిగింద న్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయండి..

### – కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వై,మధుసూదన్ రెడ్డి



**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ :** కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా జిల్లాలో విస్తృతంగా పార్టీ చేరికలు సాగుతున్నాయని అనంతపురం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై మధుసూదన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం గుంతకల్ నియోజకవర్గం నుంచి టీ తిమ్మారెడ్డి జీ మల్లికార్జున (మాజీ పిసిసి మెంబెర్ ) ఆధ్వర్యంలో నాయకులు జిలాన్., దూదేకుల సంఘం గుంతకల్లు పట్టణ అధ్యక్షుడు కుళ్లాయప్ప, రామిరెడ్డి,చంద్ర మరియు 30 మంది కార్యకర్తలు తో సహా అనంతపురం నగరం లోని జిల్లా కార్యాలయం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై మధుసూదన్ రెడ్డి సమక్షంలో లో కాంగ్రెస్ పార్టీ లో కి చేరడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ బలోపేతని నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ,అందరూ కలిసి నియోజక వర్గం లోని స్థానిక సమస్య ల పై కలసి పోరాటాలు చేయాలని అయన సూచించారు . అదేవిధంగా రేపు జిల్లా లో జరగనున్న విద్యుత్ ఛార్జిల పెరుగుదల మీద చేయు నిరసన కార్యక్రమం లో ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో నాయకులు సోనియా శీన, ప్రసాద్ రెడ్డి, ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు ఓబులేసు, యూత్ కాంగ్రెస్ నాయకులు మూర్తి, మైనారిటీ షఫీ, శివారెడ్డి పాల్గొన్నారు..

**నేడు జిల్లా కేంద్రంలో కరెంటు చార్జీల పెరుగుదలపై నిరసన**

శనివారం అనంతపురం జిల్లా కేంద్రంలో కరెంటు చార్జీల పెరుగుదలపై నిరసన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ తరఫున పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు వై మధుసూదన్ రెడ్డి తెలిపారు. అనేక హామీలను ఇచ్చిన కూటమి ప్రభుత్వం హామీల నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రజలకు సంక్షేమాన్ని విస్మరించి వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. దేశంలో రాష్ట్రంలో 1940 నుంచి 80 వరకు అధికారంలోకి ఉన్న కాంగ్రెస్ పార్టీ అనేక ప్రాజెక్టులను తీసుకువచ్చి ప్రజలకు సంక్షేమాన్ని అభివృద్ధిని అందించిందన్నారు. కానీ ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో పూర్తి నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ప్రజా సంక్షేమాన్ని చేస్తామని ఎన్నికలలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అందిస్తామని నేటికి కూడా వాటిని అందించలేదన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల నేతృత్వంలో అనేక ప్రజా పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ముసాయిదాలో పెరిగిన ఓటర్లు..

### – జాబితాలో పురుషులే ఆధిక్యం



**తాడిపత్రి, మేజర్ న్యూస్:** కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా సవరణను సెప్టెంబర్ 20వ తేదీ నుంచి అక్టోబర్ 18 వరకు బిఎల్ఓ ల ద్వారా ఇంటింటా జాబితా పరిశీలన చేపట్టారు. అక్టోబర్ 29 న ముసాయిదా జాబితా విడుదల చేశారు. డిసెంబర్ 24 వరకు అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత నవీకరించిన తుది జాబితాను విడుదల చేస్తారు. 2025 జనవరి 25 నాటికి 18 ఏళ్లు నిండిన వారి నుండి కూడా దరఖాస్తులు తీసుకున్నారు. జనవరిలో ముసాయిదా ప్రకటించినా వీరిని కొత్త ఓటర్లుగా పరిగణించి ఓటర్ల జాబితాలో అదనంగా చేరుస్తారు. నెలరోజుల పాటు నిర్వహించిన ఈ ప్రక్రియలో కొత్తగా ఓటర్ల నమోదు, మృతుల తొలగింపు సక్రమంగా లేని చిత్రాలు సరిదిద్దడం, డబుల్ ఎంట్రీలను తొలగించడం, చిరునామాలు, పేర్లలో తప్పులను సవరించారు. సవరణ చేయడానికి వీలుగా ఫారం -6, ఫారం-7, ఫారం - 8 దరఖాస్తులను స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నాటికి తాడిపత్రి నియోజకవర్గంలో 272 కేంద్రాల పరిధిలో 2,48, 781 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,23,442 మంది పురుషులు, 1,25,313మంది మహిళలు , 26 మంది ఇతరులు ఉన్నారు.

**ముసాయిదా ఓటర్ల జాబితా వివరాలు..**

తాడిపత్రి నియోజకవర్గం లో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి. తాడిపత్రి నియోజకవర్గంలో గడచిన సార్వత్రిక ఎన్నికల నాటికి మొత్తం మంది 2,48,781 మంది ఓటర్లు ఉండేవారు. 272 కేంద్రాలు ఉండేవి. ప్రస్తుతం ముసాయిదా జాబితా ప్రకారం 274 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం 2,49,047 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,23,513 మంది పురుషులు, 1,25,509 మంది మహిళలు, ఇతరులు 25 మంది ఉన్నారు. మొత్తం మీద గడచిన సార్వత్రికల ఎన్నికల ముందుకంటే ముసాయిదా ఓటర్ల జాబితా వెలువడ్డాక 2,071మంది పురుష ఓటర్లు పెరిగారు. 196 మంది మహిళా ఓటర్లు పెరిగారు. అయితే మహిళల కంటే పురుష ఓటర్లే అధికంగా ఉన్నారు.

**జనవరి 6న తుది జాబితా**

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జనవరి 6వ తేదీన ఓటర్ల తుది జాబితా వెలువడుతుంది. ఇటీవల ప్రకటించిన ముసాయిదా జాబితా పై ఈనెల 29 వరకు అభ్యంతరాల స్వీకరణకు గడువు ఉంది. ఈనెల 9, 10, 23, 24 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి మార్పులు, చేర్పులు సవరణకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. . రజాక్ వలి,తహశీల్దార్, తాడిపత్రి

## రూ.2.20 లక్షల నగదు రికవరీ మూడు కత్తులు, ఇనుప రాడ్, స్కూటీ స్వాధీనం

### – పట్టణ ఎస్సై బాబ్జాన్



**కదిరి,మేజర్ న్యూస్ :** పట్టణంలోని అత్తార్ రెసిడెన్సీ లో మేనేజర్ గా పని చేస్తూ అడపాల వీధి లో నివాసం ఉంటున్న పి. నారాయణస్వామి ఇంట్లో నగదు చోరీ చేసిన కేసులో నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై బాబ్జాన్ తెలిపారు. బాగేపల్లి తాలూకా కుమ్మర పేటకు చెందిన సల్మాన్ ఖాన్, అహ్మద్, ఫరూక్ అబ్దుల్లా, పేటీఎం మండలం పట్టామాండ్లపల్లికి చెందిన తోక శ్రీకాంత్ రెడ్డి లను హిందూపురం రోడ్ లోని గట్ల వద్ద అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ముద్దాయి ల్లో నారాయణస్వామి ఇంటి పై ఇద్దరు కొత్త వ్యక్తులకు బాడుగకు ఇవ్వగా, తన ఇంటికి వచ్చి ఇంటిలో ఉన్న 3,50,000 నగదును చోరీ చేసినట్లు అక్టోబర్ 18న పట్టణ పోలీస్ స్టేషన్ లో నారాయణస్వామి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి వీరిని గురువారం సాయంత్రం అరెస్టు చేయడం జరిగిందని మెసేజ్ తెలిపారు వీరి వద్దనుండి 2,20,000 నగదు, మూడు కత్తులు ,మూడు ఇనుప రాడ్లు, స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు మెసేజ్ తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంలో ఎస్సై బాబ్జాన్ తో పాటు హెడ్ కానిస్టేబుల్ జాకీర్ హుస్సేన్ కానిస్టేబుల్ శంకర్ రెడ్డి, రాజప్ప ఇతర సిబ్బందిని కదిరి డిఎస్పీ తో పాటు పుట్టపర్తి డిఎస్పి సైతం అభినందనలు తెలిపారు. ముద్దాయిలను కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ కు పంపుతూ ఆదేశాలు ఇవ్వగా కదిరి సబ్ జైలు కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంను సద్వినియోగం చేసుకోండి

- ఆర్డీఓ మహేష్



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 9, 10వ తేదీలు, 23వ, 24వ తేదీలలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని బిఎల్ఓ ల ద్వారా పోలింగ్ బూతులలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నూతన ఓటు, చేర్పులు మార్పులు తదితర విషయాలను పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. ఫారం-6 లో 18 సంవత్సరాలు నిండిన వారు ఓటును నమోదు చేసుకొనుటకు, ఫారం-7 లో తొలగింపులు, మృతి, డబుల్ ఎంట్రీ, ఇల్లు మార్పులు, వివాహమై వెళ్ళిన వారు, అదేవిధంగా ఫారం-8 చేర్పులు మార్పులు లను బిఎల్ఓ ల దగ్గరకు వెళ్లి మార్పు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కావున ప్రజలందరూ ఈ ప్రత్యేక ఓటర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# టిడిపి సభ్యత్వంతో కార్యకర్తలకు ప్రమాద బీమా..

-టిడిపి సీనియర్ నాయకుడు రామ్మూర్తి నాయుడు
-సభ్యత్వాన్ని త్వరగా పూర్తి చేయాలి...



**రామగిరి మేజర్ న్యూస్ :** కార్యకర్తలకు టిడిపి సభ్యత్వంతో ప్రమాద బీమా లభిస్తుందని రామగిరి మండల సీనియర్ నాయకుడు రామ్మూర్తి నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మండలం తెదేపా నాయకులు మాట్లాడుతూ సభ్యత్వంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించి రాష్ట్రంలోనే రాప్తాడు నియోజకవర్గం ముందుండేలా సభ్యత్వం చేసే విధంగా ఉండాలని పేర్కొనడం జరిగినది. అలాగే సభ్యత్వం పొందిన వారికి ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే ఐదు లక్షల ప్రమాద బీమా ఇవ్వడం సాధారణ మరణానికి పది వేలు కింద తక్షణమే ఇవ్వడం జరుగుతుంది. ప్రమాదవశాత్తు సభ్యత్వం ఉన్న ఆ కుటుంబ పెద్ద కోల్పోతే వారి పిల్లలు అనాధలు కాకుండా ఇబ్బంది లేకుండా ఐదు లక్షలు ఇవ్వడం జరుగుతుంది అని మండల నాయకులు విధి విధానాల గురించి వివరించడం జరిగినది. మండలంలోని తెదేపా కార్యకర్తలందరూ బాధ్యత తీసుకొని సభ్యత్వాన్ని త్వరగా పూర్తిచేయాలని టిడిపి సీనియర్ నాయకుడు రామ్మూర్తి నాయుడు కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పరందామయాదవ్, మండల కన్వీనర్ సుధాకర్, మండల ప్రధాన కార్యదర్శి మారుతి ప్రసాద్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీధర్ నాయుడు, హిందూపురం పార్లమెంటరీ అధ్యక్షుడు రంగయ్య, బిసి సెల్ అధ్యక్షుడు చిత్తరంజన్, రామగిరి డీలర్ నరసయ్య, వై సురేష్, పోలేపల్లి ప్రభాకర్ తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్ని దానాల్లో కెల్లా అన్నదానమే మిన్న - టిడిపి నాయకులు



**సోమందేపల్లి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోనే ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు కోసం వచ్చే గర్భిణీలకు గత 5సంవత్సరాల 6 నెలల నుండి ఉచిత అన్నదాన పౌష్టికాహారం అందజేయడం అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అని తెదేపా నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ గత 5సంవత్సరాల 6నెలల నుండి ఇక్కడ ఆరోగ్య పరీక్షల కోసం వస్తున్న గర్భిణీ స్త్రీలకు పోషకాలతో కూడిన పౌష్టిక ఆహార అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అందుకు ప్రతి ఒక్కరు ఆమెకు అభినందనలు తెలియజేస్తున్నారని నిరంతర ప్రక్రియగా ఈ కార్యక్రమం జరుగుతోందని తెదేపా నాయకులు సంతోషాలను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిష్టప్ప, నాగరాజు, మూర్తి, ఆంజనేయులు, మద్దిలేటి, రంగ, వైద్యాధికారులు ఓంకార్, అనిల్, చిరంజీవి, గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

## మూడవరోజు

# సాగిన క్రికెట్ మ్యాచ్

-ఉత్సాహంగా పాల్గొన్న ఆరు జట్లు

**ధర్మవరం టౌన్ మేజర్ న్యూస్:** పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ మైదానం నందు చేనేత ప్రముఖులు టిడిపి నాయకులు సంద రాఘవ ఆయన సోదరుడు సంద రవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ శుక్రవారం మూడో రోజు చేరింది. శుక్రవారం ఆరు జట్లు పోటీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రూరల్ సీఐ ప్రభాకర్ శ్రీనివాస గోల్డ్ షాప్ యజమాని శశాంక్ హాజరై మ్యాచ్లను తిలకించారు. మొదట వాల్మీకి వర్సెస్ రాయల్ స్ట్రైకర్స్ మధ్య పోటీ నిర్వహించగా వాల్మీకి జట్టు 111 పరుగులు చేయగా రాయల్ స్ట్రైకర్ జట్టు 78 పరుగులు చేయగా , రెబల్ స్టార్ వర్సెస్ బదన్నపల్లి జట్టు తలపడగా రెబల్ స్టార్ జట్టు విజేతగా నిలిచింది. మూడో మ్యాచ్లో చైతన్య టీం వర్సెస్ ఉప్పర్లపల్లి జట్ల మధ్య పోటీ జరగ గా చైతన్య టీం విజయం సాధించింది. నాలుగో మ్యాచ్లో భైరవ ఎలెవన్ వర్సెస్ సాయి కృప జూనియర్ కళాశాల జట్టు తలపడగా భైరవ జట్టు విజయాన్ని అన్నందుకుంది. ఐదో మ్యాచ్లో శ్రీహరిపురం రాకెట్స్ వర్సెస్ మరూరు ఈమధ్య పోటీ జరగగా ఇందులో మరూర్ టీం విజయకేతనం ఎగరవేసింది. చివరిలో అడ్వకేట్ వర్సెస్ స్టార్ టీం మధ్య పోటీ జరగగా స్టార్ టీం జట్టు విజయం సాధించింది. విజయం సాధించిన జట్లను రూరల్ సీఐ ప్రభాకర్ తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పురుషోత్తం, టీం నిర్వాకులు భరత్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.





## దోమల బెడద పట్ల జాగ్రత్త వహించాలి



**ధర్మవరం మేజర్ న్యూస్:** ప్రతి ఒక్కరు దోమల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సహాయ మలేరియా అధికారిలక్ష్మీనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం శివానగర్లో జిల్లా సహాయ మలేరియా అధికారి తోపాటు సబ్యూనిట్ మలేరియా అధికారులు పర్యటించి డెంగ్యూవ్యాధి గురించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహనకల్పించారు. ఇంటి పరిసర ప్రాంతాలలో శుభ్రంగా ఉంచాలని, నీటి తొట్టెలలో నీటిని నిల్వఉంచరాదని, రాత్రి సమయాల్లో ఇంటిలో వేపాకు పొగ వేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే ను డ్రైడేను, వెక్టార్ కంట్రోల్ ఇష్యూస్ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు జయరాంనాయక్, గోపీనాయక్, వెంకటేష్, ఏఎంఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా యూటీఎఫ్ స్వర్ణోత్సవ

## మహాసభలను విజయవంతం చేయండి



**ధర్మవరం మేజర్ న్యూస్:** యూటీఎఫ్ ఆవిర్భవించి 50సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల10న కదిరిలోని జిల్లాపరిషత్ పాఠశాలలో నిర్వహించే స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఉప విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ కిష్టప్పతో కలిసి యూటీఎఫ్ నాయకులు ఆహ్వానకరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే పీఆర్సీని అమలుచేయాలని, బకాయి పడ్డ డీఏ, పీఎఫ్, వెంటనే విడుదల చేయాలన్నారు. అప్లై చేసుకున్న ఈఎల్ఎస్ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అపార్ నంబర్ జెనరేట్లో ఉపాధ్యాయ లపై ఒత్తిడితగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, లక్ష్మయ్య, రామాంజినేయులు, హరికృష్ణ, సాయిగణేష్, హిందీపండింట్ వేణుగోపాల్, పీడీ నాగేంద్రలు పాల్గొన్నారు.

## మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నూతన కమిటీ ఎన్నిక



**ధర్మవరం టౌన్ మేజర్ న్యూస్:** ధర్మవరం మున్సిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల నూతన కమిటీని గురువారం ఎంపిక చేశారు. కార్మికుల ఓటింగ్ పద్ధతిన ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికుల అధ్యక్ష కార్యదర్శుల నియామకం చేపట్టారు. యూనియన్ అధ్యక్షులుగా బొగ్గు నాగరాజు,ఉపాధ్యక్షులుగా అంకె పెద్దన్న,దాసరి సురేష్, కార్య దర్శులుగా జయకృష్ణ..బాబు, కోశాది కారిగా అనీల్ కుమార్,కాటమయ్య. మరియు కార్యవర్గ సభ్యులను కార్మికులు నూతనకమిటీని ఎన్నుకోవడం జరిగింది.

## గర్భిణులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

- మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్ గౌతమి




**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పట్ల తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకున్నప్పుడే చక్కటి ఆరోగ్యం లభిస్తుందని మెడికల్ ఆఫీసర్ డా ఎన్ గౌతమి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు చిన్న తంబి చిన్నప్ప, కార్యదర్శి మంజునాథ్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని శివానగర్లో గల అర్బన్ హెల్త్ సెంటర్లో గర్భిణీ స్త్రీలకు వైద్యులు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కమిటీ చేతులు మీదుగా పండ్లను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినెల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీల పట్ల గ్రామాలలో పట్టణాలలో పూర్తి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. గర్భిణీ స్త్రీల పట్ల కుటుంబ సభ్యులు కూడా జాగ్రత్తలు తీసుకొని, ఎప్పటికప్పుడు వైద్య చికిత్సలను అందించి, ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం పొందేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని తెలిపారు. నెలవారి వైద్య చికిత్సలు తప్పనిసరిగా గర్భిణీ స్త్రీలు చేయించుకోవాలని తెలిపారు. సుఖమైన ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రులకే వెళ్లాలని తెలిపారు. ప్రభుత్వం కూడా అన్ని సౌకర్యాలను కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వేణుగోపాల్, సహకార దర్శి రామకృష్ణ, కోశాధికారి చంద్రశేఖర్, సభ్యులు రామకృష్ణ, సాయి ప్రసాద్, నాగరాజు, నారాయణరెడ్డి, ఏఎన్ఎం పుష్పలత, నారాయణమ్మ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## నిరక్షరాస్యులకు ఉల్లాస్ ఎంతో ఉపయోగం



నంబులపూలకుంట, మేజర్ న్యూస్ : ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమం నిరక్షరాస్యులకు వరంలాంటిదని వయోజన విద్య సూపర్వైజర్ సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో వయోజన విద్య సూపర్వైజర్ సుధాకర్ అధ్యక్షతన వయోజన విద్య పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లాస్ ప్రాథమిక అక్షరాస్యత అంటే చదవడం, రాయడం, గణిత ప్రక్రియలు నెరవేర్చటమే కాకుండా మారుతున్న సమాజానికి అవసరమైన ఆర్థిక అక్షరాస్యత డిజిటల్ అక్షరాస్యత లీగల్ అక్షరాస్యత వీడియో పాటలు నేర్పుతారని తెలిపారు. ఈ కార్యక్రమం కేవలం ద్వాక్రా గ్రూపుల్లోని నిరక్షరాస్యులైన సభ్యులకు మాత్రమే ఉద్దేశించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్ నాయక్, ఏపీఎం వెంకటనారాయణ, సిడిపిఓ నరసమ్మ, మౌలాబీ, సర్పంచ్ అంజనమ్మ , సూపర్వైజర్, క్లస్టర్ కోఆర్డినేటర్, వివోఏలు, వాలంటరీ టీచర్లు పాల్గొన్నారు.

## హొన్నంపల్లి సచివాలయంలో సిబ్బంది కొరత



పరిగి మేజర్ న్యూస్ : గ్రామ సచివాలయాల్లో పూర్తిస్థాయిలో ఉద్యోగులు లేకపోవడంతో ఆయా శాఖలకు సంబంధించిన పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. పరిగి మండలంలోని హొన్నంపల్లి సచివాలయంలో 18నెలల నుంచి డిజిటల్ అసిస్టెంట్ విధులకు హాజరు కావడం లేదు. వీరి స్థానంలో వేరే వాళ్ళని నియమించలేదు అదేవిధంగా హొన్నంపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి మెడికల్ లీవ్ లో ఉన్నారు అంతేకాక సచివాలయాల్లో వున్న మిగిలిన ఉద్యోగులపై పని భారం పెరుగుతున్నది సచివాలయానికి వస్తున్న జనం సమస్యల పరిష్కారం కోసం కాళ్లరిగేలా తిరగాల్సి రావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సచివాలయ%శీ%లో పూర్తిస్థాయిలో డిజిటల్ అసిస్టెంట్లు వుండేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు పరిస్థితి ఇలాగే కొనసాగితే జనాల్లో అసంతృప్తి పెరిగి అది ఆందోళనలకు దారి తీస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమతున్నాయి.

## ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణకు ఆన్లైన్లో దరఖాస్తుల స్వీకరణ



బుక్కపట్నం మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంఘిక సంక్షేమ శాఖ , గిరిజన సంక్షేమ శాఖ అమరావతి వారి ఉత్తర్వుల మేరకు, రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులముల మరియు షెడ్యూల్డ్ తెగల అభ్యర్థులకు డి. యస్. సి. పరీక్ష కొరకు ఉచిత భోజన మరియు వసతి సౌకర్యములతో కూడిన మూడు నెలల పాటు శిక్షణ పొందుటకు http://jnanabhumi.ap.gov.in ఆన్లైన్ వెబ్ సైట్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తు నమోదు చేసుకొనుటకు తేది: 11.10.2024 నుండి 21 వరకు అవకాశం కల్పించడమైనది. పభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయమును సద్వినియోగం చేసుకొని, మీ ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకొనుటకు ఈ అవకాశమును సద్వినియోగము చేసుకొనవలసినదిగా శివరంగ ప్రసాద్ జిల్లా యసి వెల్ఫేర్, సాధికారిత అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ, శ్రీ సత్య సాయి జిల్లా, పుట్టపర్తి వారు తెలియజేశారు

## పదవ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజులు చెల్లింపు



కదిరి, మేజర్ న్యూస్: హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో కదిరి రూరల్ మండలం కొండమనాయుని పాల్యం, కదిరి బ్రాహ్మణపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 59 మంది విద్యార్థులకు సంబంధించి పరీక్షా ఫీజును దాత, విద్యుత్ శాఖ ఏడిఏ శ్రీనివాస సహకారంతో 7375 రూపాయలు ఫీజు చెల్లించినట్లు తెలిపారు. పరీక్ష ఫీజు కు సంబంధించిన మొత్తాన్ని ప్రధానోపాధ్యాయుడు శంకర్ బాబు, ఇన్చార్జి హెచ్ఎం రఘునా థరెడ్డి లకు అందజేసినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు. ఏడిఏ శ్రీనివాస్ దాదాపు నాలుగు సంవత్సరాల నుంచి విద్యార్థులకు ప్రతి సంవత్సరం నోటు పుస్తకాలు వార్షిక ఫీజులు చెల్లించడంతోపాటు విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత కావాలన్నా ఉద్దేశంతో మోడల్ పేపర్స్ పరీక్ష సామాగ్రిని అందజేయడం జరుగుతోంది. సందర్భంగా ఆయనకు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందన తెలిపారు. కార్యక్రమంలో నరసింహులు నాయక్ భాస్కర్ నాయక్ ఉపాధ్యాయులు శంకర్ రెడ్డి, రవీందర్ నాయుడు, రాజు, హరిప్రసాద్, పద్మావతి, విశ్వనాథరెడ్డి, ఉషారాణి, వసుంధర, నాగమణి, సలీం, రామకృష్ణ ,తదితరులు పాల్గొన్నారు.

# పూలకుంటపల్లిలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అమడగూరు, మేజర్ న్యూస్: మండల పరిధిలోని పూలకుంటపల్లి రెవెన్యూ గ్రామంలో శుక్రవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రామసభను ) తహసిల్దార్ రామనాథరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ రామనాథ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ఈ నెల 4 నుంచి మండలంలో అన్ని రెవెన్యూ గ్రామంలో నెలకొన్న భూ సమస్యలు, రేషన్, ఇళ్ల స్థలాలు, తదితర సమస్య లపై గ్రామ సభలు నిర్వహిస్తుందన్నారు. అందులో భాగంగా పూలకుంట పల్లి లో గ్రామసభ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామ సభలో తహసిల్దార్ రామనాథ్ రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ గ్రామంలో భూ సమస్యల, రేషన్, ఇళ్ల స్థలాలు, తదితర సమస్యలు ఉన్న ప్రజలు గ్రామ సభలో అర్జీలు సమర్పించుకుంటే వెంటనే ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆన్ లైన్ లో పొందుపరచి అర్హత కలిగిన అర్జీలను పరిష్కరిస్తామన్నారు. పులకుంటపల్లి గ్రామ సభకు 20 మంది పలు సమస్యలపై ఫిర్యా దులు సమర్పించుకున్నారు. అందులో 14 మంది





పింఛన్లు, నలుగురు అసైన్మెంట్ కోసం, మరో ఇద్దరు రేషన్ కార్డు కోసం అర్జీలు సమర్పించు కున్నారన్నారు. వీటిని ఆన్లైన్ లో పొందుపరచి అర్హులైన వారికి తగిన న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మహేంద్ర ప్రసాద్, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పనుల్లో అవినీతి అరికట్టాలి

### – ఎంపీడీవోకు సిపిఐ నాయకులు వినతి

తలుపుల, మేజర్ న్యూస్: మండల పరిధిలోని ఉపాధి పనుల్లో అవినీతి కంపు కొడుతోందని, వాటిని సంబంధించిన మస్టర్లు పరిశీలించి అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల సిపిఐ నాయకులు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీడీవో రామా నాయక్ కు వినతిపత్రం ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు ఈశ్వరయ్య మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లా లో ఎక్కడలేని విధంగా తలుపుల మండలంలో ఉపాధిలో అవినీతి కూరుకుపోయిందని సంబంధించిన అధికారులు స్పందించి అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాల్లో ఉన్న లేకున్నా ఉపాధి పనికి వెళ్లిన వెళ్లకుండానే వారి అకౌంట్ లో డబ్బులు జమవుతుంది, దీనిబట్టి చూస్తే అవినీతి ఎంత కూరుకుపోయిందని తెలుస్తుందన్నారు. మస్టర్లలో పేర్లు పరిశీలిస్తే అర్థమవుతుంది, వారి సంతకాలు లేకున్నా సంతకాలు చేసి కార్యాలయానికి అందజేస్తున్నారు. వీటన్నిటిని పరిశీలించి ఎవరైతే అక్రమంగా ఉపాధి పనికి పెడతారో వారి పైన





చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ నాయకులు ఎంపీడీవోకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. అవినీతి చేసిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ చర్యలు తీసుకోకపోతే దోమ పిడి జిల్లా కలెక్టర్ కు పూర్తి ఆధారాలు తో సహా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు హుస్సేన్ భాషా, రవికుమార్ నాయుడు, చంద్రారెడ్డి, వెంకట నారాయణ పాల్గొన్నారు.

## ప్రజల భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ గ్రామసభల ముఖ్య ఉద్దేశం



నల్లమాడ, మేజర్ న్యూస్ : ప్రజల సమస్యల భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన గ్రామ రెవెన్యూ గ్రామ సభలు పరిష్కారమే ధ్యేయం అని తహసిల్దార్ రంగ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చారు పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో గ్రామస్తులు నుంచి వివిధ సమస్యల వినతులను రావడం జరిగిందన్నారు. ఇందులో 15 వినతులు వచ్చినట్లు తెలిపారు. గ్రామ సభలో వచ్చిన సమస్యలు వివిధ స్థాయి లో అధికారులు చర్చించి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో జయప్రద, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సభ్యత్వం నమోదుపై టిడిపి సమావేశం



నల్లమాడ, మేజర్ న్యూస్ :పుట్టపర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆదేశాల మేరకు నల్ల మాడ మెయిన్ రోడ్డు లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమం పై సమావేశం నిర్వహించారు. సభ్యత్వ నమోదు విస్తృతంగా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శంకర్, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, మారాల చెన్నారెడ్డి, అరవింద్ బాబు, వలం కిష్టప్ప, రాజు నాయక్, సిద్దార్థ నాయక్, పోమియో నాయక్, కేశవరెడ్డి, కె శ్రీనాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించిన ఎమ్మెల్యే

శింగనమల,మేజర్ న్యూస్ : శింగనమల నియోజకవర్గం పరిధిలోని పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నియోజవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అందించారు. నియోజవర్గ వ్యాప్తంగా రూ. 6,34,089 ల చెక్కులను అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణి శ్రీ మాట్లాడుతూ వివిధ అనారోగ్య సమస్యలతో, అంతేగాకుండా ప్రమాదాలలో గాయపడి మెరుగైన వైద్యం పొందెందుకు అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్న, పేదలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కి ఎమ్మెల్యే శ్రావణి శ్రీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు,కార్యకర్తలు,కూటమి శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా శ్రీ వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం

### హాజరైన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మడకశిర, మేజర్ న్యూస్: స్థానిక పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆలయ అర్చకులు ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక మాజీ ఎమ్మెల్సీ గుండు మల తిప్పే స్వామి హాజరయ్యారు. తొలుత గా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, ఆలయ అర్చకులు, మహిళలు, భక్తాదులు, చిన్నారులు పాల్గొన్నారు.



# కళ్యాణదుర్గం సబ్ డివిజన్‌లోని పోలీసు స్టేషన్లు ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ :** కళ్యాణదుర్గం అర్బన్, రూరల్ సర్కిల్ , రూరల్ యు.పి.ఎస్ పోలీసు స్టేషన్‌లను ఆకస్మికంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ తనిఖీ చేశారు. ఈ మూడు పోలీస్ స్టేషన్లు, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసు స్టేషన్లలోని లాకప్, రిసెప్షన్, జి.డి రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. క్రైం చార్టును పరిశీలించి ఎలాంటి నేరాలు నమోదవుతున్నాయి, వాటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ పోలీసు స్టేషన్ల పరిది లోని సమస్యాత్మక గ్రామాలలో శాంతిభద్రతల గురించి చర్చించారు. సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ముఖ్యమైన కేసులు, పాత గ్రేవ్, ఎక్సైజ్ కేసులను సమీక్షించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతకు భరోసా కల్గించే విజిబుల్ పోలీసింగ్ కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమర్థవంతమైన నేర నియంత్రణ, ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.



రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. సైబర్ క్రైం, డయల్ – 100, సీసీ కెమేరాల ప్రాముఖ్యతలపై అవగాహన చేయాలన్నారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, ఇసుక అక్రమ రవాణ, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా పని చేయాలన్నారు. అనంతరం ... పోలీసు స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి సాధకబాధకాలు విన్నారు. విధుల్లో ఏమి చేయాలో, ఏమి చేయకూడదో దిశా నిర్దేశం చేశారు. జిల్లా ఎస్పీతో పాటు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, సి.ఐ లు వంశీకృష్ణ, వెంకటరమణ, నీలకంఠేశ్వర్, వెంకటరమణలు ఉన్నారు.

## భూ సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు : మంత్రి

**సోమందేపల్లి, మేజర్ న్యూస్ :** ప్రజల సమక్షంలోనే భూ సమస్యల అక్కడికక్కడే పరిష్కారం కోసం ప్రభుత్వ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సవితమ్మ పిలుపునిచ్చారు శుక్రవారం పెనుకొండ నియోజకవర్గంలో మునిమడుగు గ్రామంలో రెవెన్యూ సదస్సు కార్యక్రమం అధికారులతో కలసి మంత్రి పాల్గొని ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. సమస్యలను వెంటనే కడికక్కడే పరిష్కరించాలని అధికారులను ఆదేశించి ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రామపంచాయతీలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రెవెన్యూ శాఖలో ఆన్లైన్ ట్యాంపరింగ్, రికార్డులు తారు మారుపై అధికారులు గ్రామస్థాయిలో ఫిర్యాదుల స్వీకరించి పరిష్కరిస్తారని గ్రామ స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని గత వైసిపి ప్రభుత్వ పాలనలో రెవెన్యూ పరంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామస్థాయిలో జరిగే రెవెన్యూ సదస్సులో రెవెన్యూ అధికారులు



పాల్గొని, సమస్యలకు పరిష్కారం చూపుతారని గత ప్రభుత్వంలో ల్యాండ్ టైటిలింగ్ లో జరిగిన మోసాలపై రైతులకు వివరిస్తూ ఈ రెవెన్యూ సదస్సు లో పట్టాదారు పుస్తకాల్లో తప్పులు ఏమైనా ఉంటే సరి చేసుకోవాలని తెలియ చేసారు. గత ప్రభుత్వం పట్టాదారు పుస్తకాలపై ముద్రించిన జగన్ ఫోటోలను తొలగించి భూ సర్వేలో జరిగిన తప్పులను సరిచేస్తూ రాజముద్ర తో ముద్రించిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వం అందిస్తుందని మంత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఆనందరావు, ఎమ్మార్వో, విఆర్వోలు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రీఓపెన్ గ్రీవెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి

### – చట్ట పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి – జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

**ధర్మవరం మేజర్ న్యూస్:** రీ ఓపెన్ గ్రీవెన్స్ పై ప్రత్యేక దృష్టి ఉంచి చట్ట పరిధిలో సమస్యను పరిష్కరించవలెనని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ధర్మవరం డివిజన్ రెవెన్యూ కార్యాలయంలోని సమావేశం మందిరంలో పలు రెవెన్యూ అంశాలపై, సాగు నీటి సంఘాల ఎన్నికలపై, ఓటర్ల జాబితా సవరణపై, కోర్టు కేసులు, ఈ ఆఫీస్, గ్రామసభలు, పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా, సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ధర్మవరం డివిజన్ అధికారి మహేష్, డివిజన్ పరిధిలోని ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేర్లు, ఎమ్మార్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల నందు, స్వీకరించిన దరఖాస్తులు పురోగతి త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు, ముఖ్య మంత్రి , ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి, స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన వినతులు సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. ఈరోజు నుండి నిర్వహించబోవు ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమ నందు తప్పనిసరిగా ప్రజల నుంచి వచ్చిన వినతులను రిజిస్టర్ నందు నమోదు చేయాలని తెలిపారు. దరఖాస్తుదారుడు కోరిన సమస్యకు అనుగుణంగా



ఎండార్స్మెంట్ స్పీకింగ్ ఆర్డర్ కచ్చితంగా దరఖాస్తు దారులకు అందజేయాలి, జిల్లాలో 46 వినియోగ సంఘాలకు సంబంధించి ఓటర్లు జాబితా తయారీ, పోలీస్ స్టేషన్ గుర్తింపు, ప్రచురణ సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణపై ఇప్పుడే అయిందని తప్పనిసరిగా బిఎల్ఎల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఓటర్ల నుండి స్వీకరించిన ఫారం – 6,7,8 దరఖాస్తులను స్వీకరించి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి ఎన్నికల నమోదు అధికారికి ప్రతిపాదనలు పంపాలని, వచ్చిన క్లైమ్ లను పరిష్కరించెలా చొరవ చూపాలన్నారు. రికార్డు రూములు నిర్వహణ ప్రభుత్వ నిబంధనల మేరకు ఉండునట్లు తగు రక్షణ ఏర్పాట్లను చేయాలని ఆయన సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకావాలని, భూ కేటాయింపు ప్రతిపాదనలను సకాలంలో పంపలన్నారు. తిరస్కరించిన ముటేషన్లను 15 రోజులకు ఒకసారి ఆడిటింగ్ నిరూపించాలని ఆడిటింగ్ చేసిన నివేదికలను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించే ఏర్పాటు చేయాలన్నారు. ఫ్రీ హోల్డ్ చేసిన అసైన్మెంట్ భూములలో రీ వెరిఫికేషన్ ను జిల్లా యంత్రాంగం నిర్దేశించిన సమయంలోనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు, ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే
మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి
చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం..
మరింత సమాచారం అందించాల్సిన
వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా
తెలియజేయాలని, ఎల్లవేళలా అందుబాటులో
ఉంటామని తెలియజేస్తున్నాం.
ఉమ్మడి అనంతపురం జిల్లాల
బ్యూరో అండ్ బ్రాంచ్ మేనేజర్
ఎన్. లక్ష్మీనారాయణ
ఫోన్ నెంబర్ : 63011 07116

విలేకరులు కావలెను
నేటి దినపత్రిక సూర్యలో కింది మండలాల్లో
పనిచేయుటకు ఉత్సాహవంతులైన,
యువకులు విలేకరులుగా కావలెను.
కొత్తచెరువు, కళ్యాణదుర్గం,
కంబదూరు, బ్రహ్మసముద్రం, గుంతకల్లు
రూరల్, విడపనకల్లు, వజ్రకరూరు,
అమరాపురం, గుడిబండ,
రాయదుర్గం రూరల్, బొమ్మనహాల్,
గుమ్మగట్ట, నార్పల, పెనుకొండ ఇన్ చార్జ్,
పెనుకొండ టౌన్, పెనుకొండ రూరల్,
చెన్నెకొత్తపల్లి,

## కడప అమీన్ పీర్ దర్గా ఉరుసు పోస్టర్లను ఆవిష్కరించిన నగర మేయర్

అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : ఈనెల 16 నుంచి 21 వరకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కడప అమీన్ పీర్ దర్గా ఉరుసు మహోత్సవానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం తన చాంబర్లో నగర మేయర్ మొహమ్మద్ వసీం సలీం ఆవిష్కరించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అమీన్ పీర్ దర్గా ఉరుసు మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు పెద్ద ఎత్తున చర్యలు తీసుకున్నారని ఈ ఉరుసు మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తరిమెల అబూ సాలెహ, వైయస్సార్ సిపి నాయకులు గంగాధర్, కడప అమీన్ పీర్ దర్గా మురిద్ లు పాల్గొన్నారు.



# ప్రజలపై పెనుభారం

-పెరగనున్న విద్యుత్ చార్జీలు
-సర్దుబాటు రూపంలో తప్పని బాదుడు
-ఈ నెల నుంచే వసూళ్లు
-గత వైసీపీ సర్కారు తప్పిదం... ప్రజలకు శాపం
-కూటమి సర్కారు బాదుడు తగ్గించాలి...
- ప్రజల విన్నపం



**ధర్మవరం మేజర్ న్యూస్:** గత వైసీపీ ప్రభుత్వ విద్యుత్ విధానాల పాపం...ప్రజలకు శాపంగా మారింది. విద్యుత్ చార్జీలు పెంచకూడదని కూటమి ప్రభుత్వం భావించినా...గత వైసీపీ సర్కారు నిర్వాకం పుణ్యమా అని పెంచక తప్పని పరిస్థితి డిస్కం లది. ఇప్పటికే విద్యుత్ వినియోగదారులు సర్దుబాటు చార్జీలతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి మరో రూ.6వేలకోట్లు వసూలు చేసేందుకు డిస్కంలకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి గతనెలలో అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు వినియోగదారుల నుంచి ఈ బిల్లులు వసూలు చేసేందుకు విద్యుత్ శాఖ సిద్ధపడింది. మొత్తంగా సర్దుబాటు చార్జీల రూపంలో మరో భారం పడనుంది. 2022-23 సంవత్సరానికి గాను ఇంధన సర్దుబాటు చార్జీలకింద నవంబరు నుంచే కరెంటు బిల్లుల్లో వసూలు చేయనున్నారు. ఇప్పటికే దీనిపై విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఆదేశాలివ్వడడంతో జిల్లా వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో సమతమవుతున్న తమపై ఆదనపు వడ్డన తగదని వాపోతున్నారు. దీనిపై ప్రజాసంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు సైతం మండిపడుతున్నారు. ఈనెల 15వ తేదీ వరకు విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ప్రజా సంఘాలు నిర్ణయించాయి. కూటమి ప్రభుత్వం స్పందించి జనంపై భారం పడకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. వాస్తవంగా జిల్లాలో వినియోగదారుల నుంచి నెలకే కోట్లాది రుపాయిలు వరకు విద్యుత్బల్లుల రూపంలో వసులు చేయనున్నారు. ప్రస్తుతం ఒక యూనిటు ప్రజలు రూ.1.90చొప్పున చెల్లిస్తున్నారు. అయితే సర్దబాటు చార్జీల వల్ల యూనిట్కు రూ.2.73 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. దీంతో సర్చార్జీల రూపంలో యూనిట్ కు 83 పైసలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. మొత్తంగా ఏ.పీఈఆర్సీ ఆదేశాల మేరకు విద్యుత్ బిల్లులు కంటే సర్దుబాటు వడ్డనలే తడిసి మోపెడవుతున్నాయన్న వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం షార్ట్ టర్మ్ కొనుగోళ్ల పేరుతో అనుసరించిన తప్పుడు విధానంపై కూటమి ప్రభుత్వం స్పందించి వడ్డన భారం తప్పించాలని ఉమ్మడి జిల్లా వాసులు కోరుతున్నారు.

**ప్రజలపై సర్దుబాటు చార్జీల భారం తప్పించాలి..**
**వెంకటనారాయణ సీపీఐ నాయకులు**



ప్రజలపై సర్దుబాటు చార్జీల రూపంలో బిల్లులు వసూళ్ల బారం తప్పిం చాలి. ఇప్పటికే జగన్ హయాంలో నే ఇష్టానుసారం సర్చార్జీలు, సర్దుబాటు చార్జీల 'పేరుతో బిల్లులు వసూళ్లు చేసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. కూటమి ప్రభుత్వం స్పందించి సర్దుబాటు చార్జీలు తగ్గించాలి.

# ఆ ఆస్తికి, తమకు ఎలాంటి సంబంధం లేదు

**-కుటదారులు వైసీపీ కౌన్సిలర్లే**
**- మీడియాతో టిడిపి నాయకులు ఆయూబ్ ఖాన్**



**కదిరి, మేజర్ న్యూస్ :** తాను, తన తల్లి ఫోర్జరీ సంతకాలు చేసి ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం పొందామని పత్రికల్లో రావడం జరిగిందని, అయితే ఆ ఆస్తికి, తమకు ఎలాంటి సంబంధం లేదని టిడిపి నాయకులు ఆయూబ్ ఖాన్ శు క్రవారం పాత్రికేయుల సమావేశంలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ తాను కౌన్సిలర్ కాక మునుపు కాట్లగల్ హయాద్బీ వద్ద కొనుగోలు చేశామన్నారు. ఆ తర్వాత వారి బంధువులైన రహంతుల్లా, బీబీలు తమకు ఆస్తిని విక్రయించామని కోరడంతో వారికే అమ్మివేసి రిజిస్టర్ సైతం చేయించినట్లు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఆ ఆస్తికి మాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆ ఆస్తి కొనుగోలు చేసిన వారిలో రహంతుల్లా సౌదీలోనూ, బీబీ పుట్టపర్తిలో ఉన్నారన్నారు. తాము మోసం చేయలేదని, మోసం చేసివుంటే వైసీపీ ప్రభుత్వంలోనే తమపై కేసులు పెట్టేవారన్నారు. వైసీపీ కౌన్సిలర్లు ఇలాహి, దాదాపీర్లు దొంగ పట్టాలు సృష్టించారని, ఆ భూమి 42 జాతీయ రహదారి విస్తరణకు వెళ్లడంతో అందుకు సంబందించి పరిహారం స్వాహా చేశారన్నారు. కేవలం తమపై బురద జల్లడానికి తమ పేరును వాడుకొన్నారని ఆరోపించారు.

## లేపాక్షి మండలంలో గ్రామసభ



**లేపాక్షి, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కోడి పల్లి గ్రామంలో ప్రత్యేక గ్రామసభ కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక మండల అధికారి సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామానికి చెందిన పలువురు రైతులు వివిధ వర్గాల ప్రజలు పాల్గొని తమ సమస్యలను ఆయా సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా అందజేశారు. అందులో భాగంగా శు క్రవారం జరిగిన గ్రామ ప్రత్యేక గ్రామ సభలో హౌసింగ్ కు సంబంధించి 9 ఫిర్యాదులు, పెన్షన్ కి సంబంధించి 6 ఇంటి స్థలాలకు కి సంబంధించి 5 ఫిర్యాదులు, రేషన్ కార్డు సంబంధించి 2, ఫీల్డ్ సర్వే గురించి 4ఫిర్యాదులు, ముటేషన్ గురించి 3 ఫిర్యాదులు, మొత్తంగా 29 ఫిర్యాదులు అందాయని ఇన్చారి తహసిల్దార్ కుమార్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మంజునాథ్ గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధరాచర్ల
## గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

**శింగనమల,మేజర్ న్యూస్ :** శింగనమల నియోజకవర్గంలోని నార్పల మండలం సిద్ధరాచర్ల గ్రామ రచ్చకట్ట వద్ద సర్పంచ్ సాకే రామాంజనేయులు ఆధ్వర్యంలో హర్షిత ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఉచిత వైద్య శిబిరంలో ఎంబిబియస్ డాక్టర్ జి రాము నేతృత్వంలో డయాబెటీస్ ,గ్యాస్ట్రిక్, ఫైల్స్ ఫిస్టులా.,వెరికోస్ వైన్స్,ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, గైనకాలజి, పాలీట్రామా, చెవి, ముక్కు, గొంతు, న్యూరో యురాలజి వంటి వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.వైద్యపరీక్షలతో పాటు ఉచితంగా మందులు మందులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాకే రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలోని ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఎలాంటి జబ్బులతో బాధపడకుండా ఉండాలని ఇలాంటి క్యాంపులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. డాక్టర్ సలహా మేరకు జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యానికి కాపాడుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామచంద్ర, ఫార్మసిస్ట్ రాజశేఖర్, మేనేజర్ హరి, జిఆర్ బిఎస్ మారుతి, సిబ్బంది, గ్రామస్తులు నాగిరెడ్డి, తిరుపాలు,రాజు,చంద్రశేఖర్ రెడ్డి,తిరుపాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో
# శాశ్వత వాచ్మెన్లను నియమించాలి

-ఏంఈఓకు విన్నవించిన సీఐటీయూ

**ధర్మవరం మేజర్ న్యూస్:** ధర్మవరం పట్టణ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో శాశ్వత వాచ్మెన్లను నియమించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు జెవి రమణ అయూబ్ ఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఈఓ గోపాల్ నాయక్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని ప్రభుత్వ పాఠశాలలందు కొంతమంది ఆకతాయి దుండుగులు విద్యార్థులను మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళుతూ వారి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఇందిరమ్మ కాలనీలో గురువారం జరిగిన సంఘటనే అందుకు నిదర్శనం అన్నారు, విద్యార్థులకు రక్షణ లేకపోవడంతో కొంతమంది పిల్లల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని చిన్నపిల్లలనికూడా చూడకుండా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అదేవిధంగా గతంలో పట్టణం లోని. కొన్నిపాఠశాలలందు దొంగతనాలు సైతం జరిగినాయి, కావున పగలు మరియు రాత్రి సమయాలలో కూడా శాశ్విత వాచ్మెన్లను నియమించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలందు భవిష్యత్తులో, గతంలో జరిగినటువంటి పరిణామాలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉన్నదని, కావున ప్రభుత్వ పాఠశాలలందు పిల్లల సంఖ్యను, తరగతులను అంచనా వేయకుండా, అన్ని ప్రభుత్వ పాఠశాలలందు వాచ్మెన్లను నియమించాలని వారు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి రక్షణ కల్పిస్తూ వారి తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురి కాకుండా చూడాల్సిన భాధ్యత కూడా ప్రభుత్వం పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొట్టు కృష్ణ తో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

-హిందూపురం పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య



**రామగిరి మేజర్ న్యూస్:** విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని హిందూపురం పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి చెందిన కే శోభ మరియు ముత్యాలప్ప దంపతుల కుమార్తె కే అలేఖ్య కుంటిమద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నది. అలేఖ్య ఇటీవల రాష్ట్రస్థాయి అండర్ 17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ఆరు లిఫ్టులు ఎత్తి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా శుక్రవారం ఉన్నత పాఠశాలలో అలేఖ్యకు బిసి సెల్ అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య టిడిపి ప్రధాన కార్యదర్శి మారుతి ప్రసాద్ ఘనంగా సన్మానించడం జరిగింది. రాష్ట్రస్థాయిలో కుంటిమద్ది పేరును నిలబెట్టిన అలేఖ్యను పలువురు అభినందించారు. విద్యార్థులందరూ కూడా క్రీడల్లో కూడా రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఈ సందర్భంగా వారు సూచించారు. అలాగే అలేఖ్య జాతీయ స్థాయిలో కూడా రాణించాలని కోరుకుంటున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ కళ్యాణమండపం భూ సమస్య పరిష్కారం

మంత్రి సవితమ్మకు అభినందనలు



**సోమందేపల్లి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని అక్కమ్మ గారి కొండ సమీపంలో భగీరథ కళ్యాణ మండ పం నిర్మాణం కోసం కోసం భూమి పూజ స్థలం సమస్య ఆగిపో వడంతో కొంత మంది భూమిమీద అభ్యంతరం తెలియ చేయడం ద్వారా తాత్కా లికంగా భూమి పూజ ఆగిపోయింది. అభ్యం తరం తెలియచేసిన వారితోను, కలెక్టర్, ఆర్డిఓతో మాట్లాడి సమస్యను పరిష్కరించిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ సమస్యను పరిష్కరించడంతో సగర, ఉప్పర కులస్తులందరూ ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు. భగీరథ కళ్యాణమండపంకి భవిష్యత్తులో ప్రభుత్వం పరంగా అన్ని సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి తెలియజేశారని పలువురు సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో సగర ఉప్పర కులస్తులు పాల్గొన్నారు.

# ఎస్వీ కళాశాలలో క్రీడా ఎత్నిక్ డే సంబరాలు

**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల సిల్వర్ జుబ్లీ వేడుకలను పురస్కరించుకుని క్రీడా, ఎత్నిక్ డే సంబరాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సంబరాలను కళాశాల చైర్మన్ డా.సి.సోమశేఖర రెడ్డి,వైస్ ఛైర్మన్ సి.చక్రధర రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మొదటి రోజు క్రీడా దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్కేయూ క్రీడా విభాగం ఆచార్యులు జెస్సి హాజరై మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితానికి క్రీడలు చాలా అవసరమని, క్రీడలతో మనిషి ఫిట్‌గా ఉంటారని, శారీరక శక్తిని ఉంచుకోవచ్చునని తెలిపారు. జీవితంలోని ప్రతి దశలో దీనికి చాలా ప్రాముఖ్యత ఉందని, ఇది వ్యక్తుల వ్యక్తిత్వాన్ని కూడా మెరుగుపరుస్తుందని తెలిపారు. క్రీడలు మన అన్ని అవయవాలను అప్రమత్తంగా ఉంచుతాయని తెలిపారు. క్రమం తప్పకుండా ఏదో ఒక రకమైన క్రీడలు ఆడటం ద్వారా మనిషి హృదయాలు దృఢంగా మారుతాయని తెలిపారు.అనంతరం క్రీడలలో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.రెండవరోజు ఎత్నిక్ డేలో భాగంగా విద్యార్థులు,అధ్యాపకులు సాంప్రదాయ దుస్తులు ధరించి జాతి




కళ,సంప్రదాయాలను ,సంస్కృతిని,నాగరికతను ,కట్టుబాట్లను ఉట్టిపడేలా సందడి చేశారు.అనంతరం ఏర్పాటుచేసిన వేదికపై విద్యార్థులు,అధ్యాపకులు ర్యాంప్ వాక్ చేసి అందరిని అలరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా ఎన్.ఎ.వి .ప్రసాద్,వైస్ ప్రిన్సిపాల్ డా.టి.శ్రీనివాసులు, ఏవో .శ్రీనాథ్,అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నాం

## - ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్

**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** జిల్లాల యూనిట్‌గా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయడానికి ఒక కమీషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్ )జాతీయ ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ పేర్కొన్నారు.శుక్రవారం ఆయన నగరంలోని ఎంఈఎఫ్ నాయకులతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2024 ఎన్నికల మేనిఫెస్టో ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని మాదిగలకు ఇచ్చిన హామీని నెరవేర్చడానికి ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ముందుకు రావడం మంచి పరిణామమన్నారు. 2000- 2004 మధ్య కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లను ఏబిసిడి లుగా వర్గీకరణ చేసి మాదిగ, ఉపకులాలకు న్యాయం చేసిన చరిత్ర చంద్రబాబునాయుడుకు ఉందని తెలిపారు. ఏపీలో రాష్ట్రస్థాయిలో రాష్ట్ర యూనిట్ గా రిజర్వేషన్ల వర్గీకరణ చేయడం,జిల్లా స్థాయిలో జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేపట్టడం సరైన నిర్ణయం అన్నారు. ఈ విధానంలో ఎస్సీ వర్గీకరణ చేయడం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాదిగ, మాల, రెల్లి ఉపకులాలకు జనాభా దామాషా ప్రకారం సమన్యాయం జరుగుతుం దన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో మాలల జనాభా ఎక్కువగా ఉన్నది. అనంతపురం జిల్లాలో మాదిగల జనాభా ఎక్కువ ఉన్నది. ఈ కోణంలో తూర్పుగోదావరి జిల్లాలో మాలలకి 12 శాతం రిజర్వేషన్లు, అనంతపురం జిల్లాలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు దక్కడానికి




అవకాశం ఉన్నదని అన్నారు. ఇలాంటి జనాభా తారతమ్యాలు ఉన్న జిల్లాలలో జిల్లా యూనిట్ గా వర్గీకరణ చేయడం వల్ల వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల శాతం దక్కుతుందని అన్నారు. తద్వారా ఎస్సీ లోని ఏ ఉపకులానికీ అన్యాయం జరిగే పరిస్థితి ఉండ కూడదని చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతీస్తున్నామని తెలిపారు.నిన్నటి రోజ ముఖ్యమంత్రి దళిత ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి దళితుల సమగ్రాభివృద్ధి కోసం చర్చించడంపై ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు మన్నెపాకుల రమేష్,జిల్లా ఉపాధ్యక్షులు బండారు నాగేంద్ర, రొక్కరూకల శ్రీనివాసులు, అధ్యక్షులు మీసాల నాగభూషణ, నగర ప్రధాన కార్యదర్శి కొడవండ్ల నారాయణస్వామి, నగర కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

# మున్సిపల్ వాహనాల డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

## -జిల్లా కలెక్టర్ డా.వినోద్‌కుమర్‌కు ఎస్సీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుల విజ్ఞప్తి

**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** నగర మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న మలేరియా, కోవిడ్, గార్బేజీ, మినీ జెసిపి, క్లాప్ ఆటో డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలలుగా జీతాలు వెంటనే విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ డా.వినోద్‌కుమర్‌కు ఎస్సీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ వాహనాల డ్రైవర్లకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ, ఇళ్ల అద్దె, పిల్లల చదువులు ఫీజులకు కట్టేందుకు, వైద్యం ఖర్చులకు డబ్బులు అప్పులు చేసుకుని దుర్భర జీవితాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వేతనాల కోసం అనేక మార్లు అధికారులు చుట్టు తిరిగి జమ కాలేదని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు వెంటనే వేయిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సి తిరుపాల్,అధ్యక్షులు మన్నల అజయ్ బాబు,ఉపాధ్యక్షులు కేఆర్ సురేష్ బాబు,కోశాధికారి మన్నల ఓబులేసు, వెంకట నరసయ్య, లక్ష్మన్న, జోసెఫ్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.





# ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలి

## - సిపిఎం నాయకులు

ఓబులదేవరచెరువు, మేజర్ న్యూస్ :రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచమని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఓట్లు వేయించుకొని ఆపై అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమని సిపిఎం నాయ కులు వెంకటేష్, బడా సుబ్బి రెడ్డి, లక్ష్మీనారాయణ పేర్కొన్నా రు. శుక్రవారం మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ లో కామ్రేడ్ పి వి రమణ అధ్యక్షతన సిపిఎం మండల కార్యదర్శిగా కుల్లా యప్ప, కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీకి విరుద్ధంగా విద్యుత్ చార్జీలను 44 శాతం పెంచడానికి వారు తీవ్రంగా ఖండించారు. పెద్ద వైసీపీ ప్రభుత్వం ఎన్నిసార్లు విద్యుత్ ఎన్నికల్లో ఓడిపోయిందని, టిడిపి ఓటమి ప్రభుత్వం దీని నుండి గుణపాఠం నేర్చుకొని పెంచిన చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సర్దుబాటు చార్జీలకు వ్యతిరేకంగా ప్రజలందరూ కలిసి పోరాడకపోతే ఈ ఆర్థిక సంవత్సరంలో చార్జీలను, 2026 - 27 లో అదనంగా మోయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీలను ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

# శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి



**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** జిల్లాలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పనిచేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో స్టాండింగ్ కమిటి సమావేశం జరుగుతున్న హాలు వద్ద ధర్నా నిర్వహించారు. కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని పెద్ద ఎత్తు నినాదాలు చేశారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మకు వారు వినతిపత్రం అందచేశారు. ఆమె స్పందింస్తూ కాంట్రాక్టర్లకు ఇవ్వవలసిన బకాయిలన్నీ కూడా జిల్లా పరిషత్ నుంచి చెల్లించామని, కార్మికులకు బకాయిలు రాలేదంటే అది కాంట్రాక్టర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలియజేశారు. పథకంలో కార్మికుల సంఖ్యను కుదింపు , పని గంటలు 12 గంటలు పెంచుతారని ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పినప్పుడు, ఈ సమస్య నా దృష్టికి రాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాగునీటి పథకం యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎర్రిస్వామి ,ఉపాధ్యక్షులు ప్రభాకర్, ట్రెజరర్ వన్నూరు స్వామి మండల బాధ్యులు చిక్కన్న, గంగాధర్, మురళీ,కార్మికులు పాల్గొన్నారు.

# మైదాన ప్రాంత గిరిజనులకు నామినేటెడ్ పదవులలో కేబినెట్ హోదా కల్పించాలి

**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో మైదాన ప్రాంత గిరిజనులకు నామినేటేడ్ పదవుల్లో కేబినేటా హోదా కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు జి.మల్లికార్జున నాయక్ కూటమి ప్రభుత్వాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గిరిజనులు విద్యా,వైద్య, ఉద్యోగ సామాజిక, రాజకీయ,ఆర్థిక పరిస్థితులలో గిరిజనులు చాలా వెనుకబాటుగా ఉన్నారు. స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అయినప్పటికీ గిరిజనులు మనుగడ నేటికీ సాధించలేకపోతున్నారు విద్య ఉద్యోగ రాజకీయ ఉపాధి రంగాలలో అవకాశాలు కల్పించకుండా కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలే చేస్తున్నారే తప్ప గిరిజనులకు ఎక్కడా కూడా న్యాయం జరగలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం త్వరలో భర్తీ చేసే నామినేటెడ్ పదవులలో మైదాన ప్రాంత గిరిజనులకు రాష్ట్ర క్యాబినెట్ హోదాను కల్పించాలని, లేని పక్షంలో గిరిజనుల పోరాటాలు, ఉద్యమాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలియజేశారు.



## భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభలు

**ఓబులదేవరచెరువు, మేజర్ న్యూస్ :** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం గ్రామ సభలు ఏర్పాటు చేస్తుందని, త ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసిల్దార్ అనంత చారి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్ లు తెలిపారు. శుక్రవారం మండలంలోని అల్లాపల్లిలో రెవెన్యూ గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భూ సమస్యలు ఉంటే సులువుగా పరిష్కారం అవుతాయి. రైతులు ఆందోళన చె దాల్సిన అవసరం లేదన్నారు. గ్రామస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్న ప్రభుత్వం పి ,జి ,ఆర్ ఎస్, గ్రామసభలో నిర్వహిస్తుందని ప్రజలు సమస్యలు ఉంటే పరిష్కరించ డానికి వేదికగా ఉంటుందని అధికారులు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉన్నవారు ఈ గ్రామ సభల ద్వారా పరిష్కరించు కోవాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మార్కెట్‌యార్డులు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

### - బిజేపి నాయకులు




శింగనమల(పుట్లూరు),మేజర్ న్యూస్ :శింగనమల నియోజకవర్గంలోని ఆరు మండలాలలో రైతులకు ఉపయోగపడేలా మార్కెట్ యార్డులు నిర్మించాలనీ కోరుతూ బిజేపి నాయకులు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ కి వినతిపత్రం అందించారు.భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ కుందూ శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ కి రైతుల సమస్యలను వివరించడం జరిగింది.పుట్లూరు మండలంలోని సుబ్బరాయుడు సాగర్ కు నీటిని విడుదల చేయాలని కోరారు. పుట్లూరు మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, గరుచింతలపల్లి చెరువులకు నిటిని విడుదల చేయాలని కోరారు.ప్రజలకు తాగునీటి కష్టాలు రాకుండా చూడాలని భారతీయ జనతా పార్టీ నాయకులు ఎమ్మెల్యే కు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే శివ శంకర్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కుంచెరపు గంగాధర్, మాజీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులు, పుట్లూరు మండల ఉపాధ్యక్షుడు రామిరెడ్డి నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, కార్యదర్శి హరినాథ్ రెడ్డి, మదిరేపల్లి నరేష్ , బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోండి

బుక్కపట్నం మేజర్ న్యూస్ : ప్రధాన ఎన్నికల అధికారి, ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు 09,10 వ తేదిలలో శనివారం మరియు ఆదివారం రోజులలో స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు బుక్కపట్నం తాసిల్దార్ షాబుద్దీన్ మాట్లాడుతూ ప్రతి ఒక బూత్ లెవల్ అధికారి స్పెషల్ క్యాంప్ ద్వారా పోలింగ్ కెంద్రాల పరిది లో ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పోలింగ్ కెంద్రం ఓటర్ లిస్ట్ లో పేరు లేని వారిని గుర్తించి వారికి ఫారం-6 ద్వారా కొత్త ఓటు కల్పించడం, 18-19 వయస్సు గల వారికి ఫారం-6 ద్వారా ఓటు కల్పించడం, ఓటర్ లిస్ట్ లో చనిపోయిన వారిని, శాశ్వితముగా ఊరి వదిలి వెళ్ళిన వారిని , రెండు ఓట్లు కలిగిన వారిని గుర్తించి వారిని ఫారం-7 ద్వారా ఓటర్ లిస్ట్ లో తొలగించుటకు సిఫారస్సు చేయవలెను , ఓటరు కార్డు లో ఏమైనా తప్పులు ఉంటే వారికి ఫారం-8 ద్వారా సరిదిద్దవలెను , ఇంకా ఎవరన్న ఓటర్ కార్డు కి ఆధార్ లింక్ చేసుకొని వారిని గుర్తించి ఫారం-6బి ద్వారా ఓటర్ కార్డు కి ఆధార్ లింక్ చేసుకోవచ్చు మండలం పరిధిలోని యువతీ యువకులు అవకాశాన్ని సద్విని చేసుకోవాలని తహసీల్దార్ తెలియజేశారు.




# కంబదూరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

- రికార్డుల నిర్వహణపై సమీక్ష... సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక నిఘా వేయాలని సూచనలు
- బాల్య వివాహాలు, సాంఘిక దురాచారాల కట్టడికి చర్యలు తీసుకోండి
- లోన్ యాప్, సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన తీసుకురండి

**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ :** కంబదూరు పోలీసు స్టేషన్ ను జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్, పరిసరాలను సందర్శించి పోలీసుస్టేషన్ నిర్వహణ మరియు రికార్డుల నిర్వహణపై లోతుగా పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్, లాకప్ గదులను పరిశీలించి పోలీసు స్టేషన్లకు వచ్చే పిటీషనర్ల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. విధుల్లో భాగంగా పోలీసులు మెయింటేన్ చేసే ప్రతీ రికార్డును సమీక్షించారు. కంబదూరు పోలీసులు ఇదివరకే సీజ్ చేసి స్టేషన్ ఆణలో ఉంచిన వాహనాలు ఏఏ నేరాలకు సంబంధించినవో అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లోని పరిస్థితులను సి.ఐ ను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సరిహద్దు గ్రామాల్లో ప్రత్యేక నిఘా వేయాలన్నారు. ఇసుక... మట్కా, గుట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, నాటు సారా తయారీ %ు% అమ్మకం



తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా పని చేయాలన్నారు. బాల్య వివాహాలు, సాంఘిక దురాచారాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. లోన్ యాప్ మోసాలు, సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు.

# అపార్ కోసం స్కూల్ రికార్డు మార్చడం సరైనది కాదు

### - ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్

**అనంతపురం విద్య మేజర్ న్యూస్ :** అపార్ నమోదు కోసం విద్యార్థి ఆధార్ లో మార్పులు చేయాల్సింది పోయి స్కూల్ రికార్డు మార్చడానికి విద్యాశాఖ ఉత్తర్వులు ఇవ్వడం సరైనది కాదని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం దేశం లోని విద్యార్థులందరికీ ఒకటే గుర్తింపు కార్డు ఉండాలనే ఉద్దేశ్యం తో ఆటోమేటెడ్ పెర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ ( అపార్ ) అమలు చేస్తోందని, అపార్ జనరేట్ కావాలంటే విద్యార్థి స్కూల్ రికార్డు, యు -డైస్, ఆధార్ లోని వివరాలన్నీ ఒకేరకంగా ఉండాలని అన్నారు. కానీ స్కూల్ రికార్స్, యు -డైస్ లో విద్యార్థుల వివరాలు ఒకేరకంగా ఉన్నప్పటికీ ఆధార్ లో మరొక రకంగా ఉండడం వల్ల అపార్ నమోదు లో ఆలస్యం అవుతోందని అన్నారు. విద్యార్థులకు ప్రతి విషయం లో స్కూల్ రికార్డు మాత్రమే ప్రామాణికం గా ఉన్నప్పటికీ, ప్రస్తుతం అపార్ నమోదు కోసం పాఠశాల లోని విద్యార్థుల రికార్డు లు మార్పు చేయడం కోసం విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం సరైనది కాదని విమర్శించారు. టీచర్లకు తగినంత సమయం కల్పించి ప్రతి



సచివాలయం లో అపార్ నమోదు ప్రక్రియ ముగిసేవరకు ఎక్కువ సంఖ్య లో ఆధార్ సెంటర్లు నిర్వహిస్తే సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. ఆధార్ లో మార్పులు చేయాల్సిన విద్యార్థుల సంఖ్య 50 కి మించితే అటువంటి పాఠశాల లో ఒకరోజు ఆధార్ సెంటర్ ను నిర్వహిస్తే సమస్య సులభం గా పరిష్కారం అవుతుందని అన్నారు. కావున విద్యార్థుల స్కూల్ రికార్డు లు ఆధార్ కు అనుగుణంగా మార్పు చేయాలనే ఉత్తర్వులను రద్దు చేసి వీలయినంత ఎక్కువ సంఖ్య లో ఆధార్ సెంటర్ లను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

# పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతాలు తెరువబడును

హిందూపురం మేజర్ న్యూస్: తపాలశాఖ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నూతనంగా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్( ఐ పి పి బి) ఖాతాలు తెరవడానికి ఆకాశముఉందని హిందూపురం డివిజన్ పోస్టల్ సూపర్ డెంట్ యు.విజయ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా హిందూపురం లో శుక్రవారం పోస్టర్ సూపర్డెంట్ యు.విజయ్ కుమార్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సేవల గురించి వివరించారు. సాధారణంగా జాతీయ, ప్రాంతీయ బ్యాంకులతో సమానంగా ఇండియా పోస్టల్ పేమెంట్స్ బ్యాంకు ద్వారా అర్హులైనటువంటి వారికి ఆర్థిక సాధికారత ప్రభుత్వ సదుపాయాల్లో లబ్ధి పొందడానికి అవకాశం ఉందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో472 పోస్ట్ ఆఫీస్ ల ద్వారా తమ బ్యాంక్ సేవలు ఉపయోగించు కోవడానికి అవకాశం ఉందన్నారు.ప్రస్తుతం



నిరుపయోగంగా ఉన్న 2లక్షల 4 వేల ఖాతాలను తిరిగి పునరుద్ధించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఆధార్ లింకేజ్ సులభతరం చేయడానికి ఈనెల 15 నుండి పట్టణ గ్రామీణ ప్రాంతాల్లోని సచివాలయ పరిధిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.లబ్ధిదారులకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సూపర్డెంట్ కోరారు.

## టిడిపి సభ్యత్వం తీసుకుందాం.. మన భవిష్యత్తుకు బాటలు వేసుకుందాం

### - టిడిపి నాయకుడు మారుతి ప్రసాద్

హిందూపురం మేజర్ న్యూస్: తెలుగుదేశం పార్టీ సభ్యత్వం పొందితే కుటుంబానికి భరోసా తో పాటు భవిష్యత్తు కు సైతం బాటలు వేస్తుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మారుతీ ప్రసాద్ అన్నారు. హిందూపురం నియోజకవర్గం లేపాక్షి మండల పరిధిలోని పులమతి గ్రామంలో శనివారరం టిడిపి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా మారుతి ప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేయించాలని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశించిన విధంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమమును దిగ్విజయవంతం చేయాలని కోరారు.



ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నరసింహప్ప, తెలుగుదేశం నాయకులు బాబావలి, ఇబ్రహీం, హరి, రామంజి, బాబా, తదితర నాయకులు , కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# 11లోపు ఫ్రీహోల్డ్ అసైన్మెంట్ భూముల వెరిఫికేషన్ పూర్తి చేయాలి

## – కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



అనంతపురం మేజర్ న్యూస్: ఈనెల 11వ తేదీలోపు ఫ్రీహోల్డ్ అసైన్మెంట్ భూముల వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఫ్రీహోల్డ్ అసైన్మెంట్ భూముల వెరిఫికేషన్ ప్రక్రియపై జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, ఆర్డీవోలు, తహసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫ్రీహోల్డ్ అసైన్మెంట్ భూముల ధృవీకరణకు సంబంధించి జిల్లాలో ఎక్కువగా పెండింగ్ ఉన్న కంబదూరు, కుందుర్పి మండలాల్లో ఈనెల 11వ తేదీలోపు వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కంబదూరు, కుందుర్పి మండలాలను కళ్యాణదుర్గం ఆర్డీఓ ప్రత్యేక దృష్టి తీసుకొని తనిఖీ చేసి అవగాహన కల్పించి వేగవంతంగా పెండింగ్ ఉన్న భూముల ధృవీకరణను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ఉన్న మండలాలలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ విషయమై ప్రత్యేక సారించాలని, ఈనెల 11వ తేదీలోపు పెండింగ్ ఉన్న మండలాల నుంచి నివేదిక అందించేలా చూడాలని డిఆర్ఓను ఆదేశించారు. ఇందులో ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని తహసిల్దార్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మలోల, కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# పోలీస్ పరేడ్ ను పరిశీలించిన జిల్లా ఎస్పీ






**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్** : జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం జిల్లా ఎస్పీ పి.జగదీష్ అనంతపురం, అనంతపురం రూరల్ సబ్ డివిజనల్ల సిబ్బంది, ఏ.ఆర్ సాయుధ బలగాల పరేడ్ ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ ఫిజికల్ ఫిట్నెస్ కల్గి ఉండాలి. చక్కగా యూనిఫాం ధరించి ప్రజలతో మంచి సంబంధాలు కల్గి ఉండాలి. అందరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యం మెరుగదల మరియు ఫిజికల్ ఫిట్నెస్ కోసం ప్రతీరోజూ గ్రౌండు, ప్రాక్టీస్ వదలకూడదు అని తెలిపారు. మీ ఆరోగ్యం బాగుంటునే మీ కుటుంబం కూడా బాగుంటుందని గుర్తుంచుకోవాలి. ఆరోగ్యంతో పాటు మానసికంగా దృఢంగా ఉంటేనే విధుల్లో సమర్థవంతంగా పని చేయవచ్చు అని అన్నారు. ఎస్కార్ట్స్, గార్డు, తదితర విధులలో నిత్యం అప్రమత్తంగా ఉండాలి. ఏ చిన్న పొరపాటు, నిర్లక్ష్యం చేపట్టినా పోలీసుశాఖ ప్రతిష్ట దిగజారే అవకాశముందని సూచనలు చేశారు. ఆతర్వాత... సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి వారి విధుల్లో మరియు ఆరోగ్య, విద్య, తదితర అంశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారం చేసే దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు... సిబ్బంది నుండీ గ్రీవెన్స్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, డీఎస్పీలు వి.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వర్లు, ఎస్ మహబూబ్ బాషా, పలువురు సి.ఐ లు, ఆర్ ఐ , ఎస్సైలు, ఆర్ ఎస్ ఐ లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ అంబికాను ఘనంగా సత్కరించిన కొల్లూరు యువత



హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : కర్ణాటక ఉడిపి మూకాంబిక దేవాలయంలో శుక్రవారం నాడు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లూరు యువ నాయకుడు రాఘవేంద్ర ఆధ్వర్యంలో కొల్లూరు యువత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ను ఘనంగా దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు గణేష్, శరత్, అనిల్, నితిన్, పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై రూరల్ పోలీసుల దాడులు

తాడిపత్రి, మేజర్ న్యూస్ : తాడిపత్రి రూరల్ పరిధిలోని వెంకటరెడ్డి పల్లి దగ్గర ఉన్న రమేష్ రెడ్డి విల్లాస్ వద్ద పేకాటా నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు సీఐ వారి సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించినట్లు తెలిపారు . ఈ దాడుల్లో భాగంగా 5 మంది వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, రూ.15,740లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సిఐ శివగంగాధర్ రెడ్డి తెలిపారు.



# సదరంకు కిక్కిరిస్తున్న రోగులు

## – ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సదరం ప్రత్యేక క్యాంపునకు విశేష స్పందన



**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లో శుక్రవారం నిర్వహించిన సదరం ప్రత్యేక క్యాంపుకు విశేష స్పందన లభించింది. కిక్కిరిస్తున్న లబ్ధిదారులతో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నిండిపోతుంది. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని డిఇఐసి కేంద్రంలో ప్రత్యేక కౌంటర్ ను ఏర్పాటు చేసి లబ్ధిదారుల ఎంపికలను చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి లబ్ధిదారులు పెద్ద ఎత్తున హాజరవుతున్నారు. ఎటు చూసినా లబ్ధిదారులు ఎక్కిరిస్తుండడంతో ప్రత్యేకంగా ఇతర ప్రాంతాలలో కూడా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నహాలు చేస్తున్నారు





# ప్రజా సమస్యలపై దృష్టి సారించండి..

## – పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల వెల్లడి

హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల అధ్యక్షతన విజయవాడలో శుక్రవారం జరిగిన అనంతపురం, సత్యసాయి ఉమ్మడి జిల్లాల డీసీసీల అధ్యక్షుల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పిసిసి అధ్యక్షురాలు మాట్లాడుతూ మీ జిల్లాలలో ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. వారానికి ఒకటి రెండు సార్లు జిల్లా సమస్యలపై సమావేశాలు ఏర్పాటు చేసుకొని ప్రజలను చైతన్య పరచాలని పేర్కొన్నట్లు సత్య సాయి జిల్లా డిసిసి అధ్యక్షులు ఎం.హెచ్ ఇనయ్ తుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిసిసి అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ముందుండి శక్తి వంచన లేకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజా సమస్యలపై ప్రతి వారానికి ఒకటి రెండుసార్లు జిల్లా సమస్యలపై సమావేశాలు ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలు జిల్లాల డిసిసి అధ్యక్షులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణకు తరలిరండి



హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : తొలితరం స్వాతంత్ర సమరయోధుడు, రేనాటి వీరుడు, వడ్డెర జాతి ముద్దుబిడ్డ శ్రీ వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణకు వడ్డెర ప్రజానీకమంతా కదిరికి వెల్లువలా తరలిరావాలని సత్యసాయి జిల్లా వడియరాజుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జె.వి.రమణ, ప్రధాన కార్యదర్శి వెంకటేశులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కదిరి పట్టణం బస్టాండ్ కూడలిలో అతి సుందరంగా నిర్మించిన శ్రీ వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ ఈ నెల 10న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి వడ్డెర సోదరులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయడం ద్వారా సమైక్యతను చాటాలని కోరారు.

# సాగునీటి సంఘాల రైతుల ముసాయిదా విడుదల

లేపాక్షి, మేజర్ న్యూస్ : లేపాక్షి మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ఈ నెల 21వ తేదీన జరగనున్నాయని, అందులో భాగంగా నీటి సంఘాల సంఘాల ముసాయిదా విడుదల చేసినట్టు ఇన్చార్జి తహశీల్దార్ కుమార్ స్వామి రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముసాయిదా జాబితాను సంబంధిత పంచాయతీ కార్యాలయంలో ఉంచడం జరిగిందని సదరు ముసాయిదా జాబితాలో చూసుకొని ఏవైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే ఈ నెల 12వ తేదీ లోపల సంబంధిత తహశీల్దార్ కు తెలియజేయాలని తెలిపారు.

# 35వ వార్డులో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం

హిందూపురం టౌన్, మేజర్ న్యూస్ : హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాలమేరకు మున్సిపాలిటీ పరిధిలో ముదిరెడ్డిపల్లి 35వ వార్డులో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర బాబు, జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం 100 రూపాయలు చెల్లించి తీసుకుంటే 5 లక్షల రూపాయలు ప్రమాద బీమా పిల్లల చదువు కి ఆర్థిక సాయం నైపుణ్య శిక్షణ ఉపాధి అవకాశాలు వంటి ప్రయోజనాలు గురించి తెలియజేశారు. ప్రతి ఒక్కరూ టిడిపి సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పల్లా కుమార్ (స్వామి), మారుతీ, మాజీ కౌన్సిలర్ వెంకట స్వామి, ఐటీడీపి శీనా, నాగరాజు, చంద్రశేఖర్, వెంకటేష్, చంద్రమోహన్ యాదవ్, పాల్గొన్నారు.







## బెలుగుప్ప గ్రామంలో శ్రీవర సిద్ధి వినాయక

# ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం

### రేపటి నుండి నాలుగు రోజులు పూజా కార్యక్రమాలు

### మలయాళ పండితులు బ్రహ్మశ్రీ శ్రీరంగం సరున్మోహన్ తంత్రి వారిచే ప్రతిష్టా కార్యక్రమం

**బెలుగుప్ప, మేజర్ న్యూస్ :** శ్రీ వరసిద్ధి వినాయక ధ్వజస్తంభ ప్రతిష్టామహోత్సవం శ్రీ విఘ్నేశ్వర ఆలయం ప్రాంగణం నందు వేదోక్తముగా వైభవోపేతముగా నిర్వహించబడని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో ప్రసిద్ధ దేవాలయాల అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవ కళ్యాణానికి, విశ్వశాంతి కొరకు అనేక దేవతా విగ్రహ ప్రతిష్టలు, యజ్ఞ యాగాదులు, హోమాలు, పూజ క్రతువులు, గ్రామ పీడా పరిహార శాంతి పూజలు నిర్వహిస్తున్న మలయాళ పండితుడు బ్రహ్మశ్రీ శ్రీరంగం సరున్మో హన్ తంత్రి అమృతహస్తాలతో ధ్వజస్తంభ ప్రతిష్టాపన జరుగును.

**ఆలయ విశిష్టత :** బెలుగుప్ప గ్రామంలో వెలసిన శ్రీ విఘ్నేశ్వరుడు మండలంలో నెలకొన్న ఏకైక లీల మానుష స్వరూపుడు. ఈ విఘ్నేశ్వరాలయం బెలుగుప్ప మండలంలోని స్థాపించబడిన ఏకైక ప్రధాన దేవాలయం. కొలిచిన వారి కోర్కెలు తథ్యముగా తీర్చి వైవాహిక, సంతాన, సంసారిక ,ఈతి, విద్యా ,ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయాల్లో కలుగు అవరోదములను తొలగించి, భక్తుల పాలిట కొంగు బంగారమై వెలుగుందుచున్నారు. విగ్రహ శైలిని బట్టి దాదాపు 15వ శతాబ్దంలో విజయనగర రాజుల సంస్థానంలో ప్రతిష్ఠింపబడినట్లు రూఢీ అగుచున్నది, నాటి పాలకులు నిర్మించిన కోటముఖ ద్వారం వద్ద ప్రతిష్ఠింపబడిన గ్రామ గణాధిపునకు (నాభి శిల లేదా బొడ్రాయి) ఉత్తర దిశలో వెలిసి, కోటమూలాలలో ప్రతిష్ఠింపబడినందున కోట విఘ్నేశ్వరుడు గా కూడా వ్యవహారంలో ఉండినట్లు తెలియచున్నది. ఈ విఘ్నేశ్వరుని ఆరాధించి ఎంతోమంది భక్తులుగ్రహ బాధల నుండి విముక్తి పొంది, తమస్థితి గతులను మెరుగుపరుచుకొన్నారు, ఈ వినాయకుని పీఠంపై ఆసీనమైయున్న భంగిమ భక్తులను మరులు గొలుపుచున్నది, ప్రతినెల సింకిష్ట చతుర్ధికి అభిషేకములు, పూజలు చేయించి భక్తులు గ్రహ బాధలు తీర్చుకొనుచున్నారు. ఈ గణేశుని కొలిచిన వారికి గురు అనుగ్రహం కలిగి ఆత్మజ్ఞానము ప్రాప్తి%శీ%చునని ప్రతీతి. పరమ పవిత్రమైన అత్యంత మహిమన్వితమై విరాజిల్లుచున్న ఈ వరసిద్ధి వినాయకుని ఆలయ ప్రాంగణం నందు నూతనంగా ప్రతిష్టించు "ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం" నందు గణపతి ఉపాసకులు, భక్తులు తప్పక పాల్గొని స్వామివారి సేవలో తరింతురని ప్రార్థన కార్యక్రమం వివరములు నవంబర్ 10వ తేదీ ఆదివారం ఉదయం 7గంటలకు అష్ట ద్రవ్య మహా గణపతి హోమము, వాస్తు పూజ సాయంత్రం 4 గంటలకు వాస్తు బలి, వాస్తు హోమం నవంబర్ 11వ తేదీ సోమవారం ఉదయం 7గంటలకు మహాగణపతి హోమం, మృత్యుంజయ హోమం, లక్ష్మీ వినాయక హోమం, మహా సుదర్శన హోమం సాయంత్రం 4గంటలకు గాయత్రి హోమం, సాయంత్రం 7గంటలకు భగవతి పూజ, దీపారాధన నవంబర్ 12వ తేదీ మంగళవారం ఉదయం 7గంటలకు 108 కొబ్బరికాయల హోమం( కర్మ విమోచన పూజ) ఉదయం 10గంటలకు సరస్వతి పూజ (విద్యార్థులకు) సాయంత్రం 4గంటలకు శత్రుదోష నివారణ పూజ (కాళీ పూజ) దీపారాధన నవంబర్ 13వ తేదీ బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ట ఉదయం 6గంటలకు గణపతి హోమము 9గంటల నుండి 10:45 నిమిషాల వరకు విశేష పూజలు ( పున: ప్రతిష్ట) ధ్వజస్తంభ ప్రతిష్ట, మధ్యాహ్నం 12 గంటలకు మహా మంగళహారతి, మృత్యుంజయ హోమము, లక్ష్మీ వినాయక హోమం, మహా సుదర్శన హోమం, కర్మ విమోచక హోమము, శత్రుదోష నివారణ హోమాలయందు పాల్గొను దంపతులు అతి తక్కువ ఖర్చుతో పీడా పరిహారం చేసుకోవచ్చును. ఆయా హోమాలలో పాల్గొని వారు ముందుగా పేర్లు నమోదు చేసుకొని రసీదు పొందువలేనని, ఇది జన్మకు ఒకసారి మాత్రం వచ్చే అవకాశం కార్యక్రమం మొదటి రోజు నుండి ప్రసాద వినియోగము. చివరి రోజున అన్న ప్రసాద వితరణ ఉండనని శ్రీ విఘ్నేశ్వర ఆలయ సేవాసమితి సభ్యులు, ప్రధాన అర్చకులు శ్రీ పంచాంగం రాంబాబు స్వామి, గ్రామ పెద్దలు, భక్తులు తెలిపారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన విహెచ్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న

**కూడేరు, మేజర్ న్యూస్ :** ఉరవకొండ నియోజకవర్గం పెన్నోబిలం దేవస్థానం నందు ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేకులకుంట రామాంజనేయులు పెళ్లి అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెళ్లికి విహెచ్ పి ఎస్ రాష్ట్ర అధికారం ప్రతినిధి పెద్దన్న, ఎంఆర్పిఎస్ ఎంఎస్సీ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ సామ్రాట్ మధులతో పాటు ఎంఆర్పిఎస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు స్వతంత్ర కుమారి నాగమ్మ, శాంతకుమారి, సుబ్బమ్మ, రమాదేవి, భవ్యశ్రీ, సౌమ్యశ్రీ, ఎమ్మార్పీఎస్ కూడేరు మండలం ఉపాధ్యక్షులు ఆంజనేయులు, సిద్ధప్ప, ఒడ్డుపల్లి మనోజ్, కుమార్, లక్ష్మీనారాయణ దళిత సంఘం నాయకులు చిన్న జలాలపురం ఎర్రిస్వామి తదితరులు హాజరై రామాంజనేయులు, లక్ష్మీ దంపతులను ఆశీర్వదించారు.

## ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ పై దాడి



**రొద్దం మేజర్ న్యూస్ :** ఉపాధి హామీ బిల్లులు సక్రమంగా రైతులకు అందుతుంటే నన్ను చూసి ఓర్వలేక మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ దాడి చేశాడని ప్రస్తుత ఫీల్డ్ అసిస్టెంట్ రవి ఆరోపించాడు. రొద్దం మండలంలోని చోలే మరి గ్రామంలో మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి హామీ బిల్లులను సక్రమంగా చెల్లించలేదని రైతులు విమర్శిస్తుంటే రికార్డులు నాకు అప్పజెప్పితే రైతులకు న్యాయం చేస్తానని చెప్పినందుకు నాపై దాడులు దిగుతున్నారని వారి నుంచి ప్రాణహాని ఉందని ఫీల్డ్ అసిస్టెంట్ రవి తెలిపాడు.ఆనందమ్మ అనే మహిళకు పండ్ల మొక్కల సాగు చేసిన బిల్లులు చెల్లించలేదని నాపై నింద మోపుతున్నారని తెలిపాడు. ఆమె గత ఐదు సంవత్సరాలుగా గ్రామంలో లేదని బిల్లులు కూడా అడగలేదని తెలిపాడు. ఈ విషయంపై ఎంపీడీవో కు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని తెలిపాడు.

## మండలంలో గ్రామ రెవెన్యూ సభలను ప్రజలు వినియోగించుకోవాలి

**పరిగి మేజర్ న్యూస్ :** పరిగి మండలం ఊటుకూరు గ్రామ పంచాయతీలో రెవిన్యూ పరిధిలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించినట్లు తహసీల్దార్ హసీనా సుల్తానా తెలిపారు. ప్రజల నుంచి రెవెన్యూ -6 పెన్షన్ -8 హౌసింగ్ సంబంధించి-13 మరో-8 స్వీకరించి గ్రామ సభల ద్వారా తక్షణ పరిష్కారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ సిద్దేశ్వర వీఆర్వోలు పాల్గొన్నారు.

## హెచ్.ఎ ఎలివేటర్స్ సంస్థ లోగోని ఆవిష్కరించిన జెసి

**తాడిపత్రి మేజర్ న్యూస్ :** హెచ్.ఎ ఎలివేటర్స్ సంస్థ లోగోని శుక్రవారం తాడిపత్రి మునిసిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా జెసి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ యువత వ్యాపార రంగం లో రాణించాలని తాడిపత్రి పట్టణంలోని నిరుద్యోగులకు వ్యాపారంగంపై అవగాహన కల్పించాలని హెచ్.ఎ ఎలివేటర్స్ ఎండీ.హరీష్ రెడ్డి తొ అన్నారు. సంస్థ మునుముందు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.



## సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డిపీలను

# వెంటనే రైతులకు మంజూరు చేయాలి



**రాయదుర్గం మేజర్ న్యూస్ :** రాయదుర్గం తాలూకా వ్యాప్తంగా సంవత్సరాల కొద్ది పెండింగ్లో ఉన్న డిపీలను వెంటనే రైతులకు మంజూరు చేయాలని, విద్యుత్ కార్యాలయం ఎదుట శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి విద్యుత్ ఏఈ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగ4ఆ సీపీఐ రాయదుర్గం తాలూకా కార్యవర్గ సభ్యులు కోట్రేష్ మాట్లాడుతూ రాయదుర్గం తాలూకా వ్యాప్తంగా కనేకల్ బొమ్మణహాల్ గుమ్మగట్ట హీరేహాళ్ మండలాల్లో దాదాపు కొన్ని వందల మంది రైతులు డీడీలు విద్యుత్ శాఖకు చెల్లించి సంవత్సరాలు కొద్ది అవుతున్న ఇప్పటివరకు రైతులకు సకాలంలో డిపోలు అందజేయడంలో విద్యుత్ శాఖ అధికారులు పూర్తిగా విఫలం చెందారు. తాలూకా వ్యాప్తంగా ఉన్నటువంటి రైతులు బోర్లు వేసుకుని డ్రిప్పు పైపులు విత్తనాలు కొనుగోలు చేసి డిపోలు వస్తే సాగు చేయడానికి మొదలు పెడదామనుకున్నా రైతులకు డిపోలో రాకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తు అప్పులు తెచ్చి కొనుగోలు చేసిన వస్తువులకు వడ్డీలు కూడా రైతులు చెల్లించుకోలేకపోతున్నమంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కారణం వారికి డిపోలో రాకపోవడం వల్ల కొంతమంది కాంట్రాక్టర్లు చేతిలో పడి రైతులు విలవిలా కొట్టుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి వాటిపై విద్యుత్ శాఖ అధికారులు నిఘా ఉంచాల్సిన బాధ్యత ఎంతో ఉంది రైతులను దృష్టిలో ఉంచుకొని వెంటనే పెండింగ్లో ఉన్నటువంటి డిపోలను ప్రతి ఒక్కటి రైతులకు మంజూరు చేసేలాగా వారికి అందజేసేలాగా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ఉంది. సంవత్సరాలు కొద్ది అవుతున్న వారికి డిపోలు అందజేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయదుర్గం మండలానికి చెందిన కొండాపురం లక్ష్మి తిప్పే స్వామికి సంబంధించి డిడి చెల్లించి సంవత్సరాలు కొద్ది అవుతుండడం వారికి సకాలంలో పంటలు సాగు చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ అప్పుల పాలై మనోవేదన అనుభవిస్తున్న సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి రైతులు రాయదుర్గం మండలంలోనే కాకుండా తాలూకా వ్యాప్తంగా ఉన్నారు రైతులను రైతు సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంటనే విద్యుత్ శాఖ అధికారులు డిపోలను మంజూరు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా రాయదుర్గం మండలం విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఏఈకి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేయడం జరిగింది. రైతులకు సకాలంలో డిపోలు అందజేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా కూడా ఆందోళనకు పిలిపిస్తామని విద్యుత్ శాఖ అధికారులకు హెచ్చరిక చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మండల కార్యదర్శి దుర్గన్న, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాలూకా అధ్యక్షులు నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా అధ్యక్షులు నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షుడు కుమార్ తేజ, సీపీఐ నాయకులు సౌడప్ప రైతులు తిప్పేస్వామి లక్ష్మణ్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## జూదరులు అరెస్టు

**నల్లచెరువు, మేజర్ న్యూస్ :** మండలంలోని నడిమిపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న ఆరు మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై మక్బూల్ భాషా తెలిపారు. వారి వద్ద నుండి 6,180 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడం తో సిబ్బంది వెళ్లి దాడులు చేసి జూ దరులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

## వివాహానికి హాజరైన పలువురు నాయకులు

శింగనమల,మేజర్ న్యూస్ :ఎమ్మార్పీఎస్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి రేకులకుంట రామాంజనేయులు వివాహానికిపలువురు నాయకులు హాజరయ్యారు.అనంతపురం జిల్లాలోని పెన్నోహెూబిలంలో జరిగిన వివాహానికి తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మొండి పోగుల ఎర్రిస్వామి, శింగనమల మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు



బెందల సాయి శంకర్ ,ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాచేపల్లి సూర్యప్రకాష్, శ్రీనాథ్ హాజరై నూతన వధూవరులను వారు ఆశీర్వదించారు.